## దుర్గా ఘాట్లో హంస వాహనం ట్రయల్ రన్



7 లో


# మనం



కృష్ణా / గుంటూరు
ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు



సోమవారం | 19 | అక్టోబర్ | 2026 | పేజీలు: 12


# రాయన X రాధా

# బెజవాడలో భీకర పోరు



బెజవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠం కోసం జరగనున్న స్థానిక సంస్థల సమరంలో పొలిటికల్ హీట్ పీక్స్‌కు చేరింది. కూటమి పొత్తులో భాగంగా జనసేన పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ (రాధా) బరిలోకి దిగగా, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఢీకొడుతున్నారు. ఇరు పార్టీల అభ్యర్థులు భారీ ర్యాలీలతో తమ నామినేషన్లను దాఖలు చేయడంతో విజయవాడ రాజకీయం రసవత్తరంగా మారింది.



6 లో

పి.మీరాహుస్సేన్ ఖాన్
-విజయవాడ, మనంబ్యూరో చీఫ్



అమ్మవారి అనుగ్రహానికి మధుర ప్రతీక
కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదం!
ఇంద్రకీలాద్రి ప్రసాదానికి విశిష్ట ఆదరణ
భక్తి, సంప్రదాయం, మాధుర్యాల సమ్మేళనం

5 లో

## దర్శనం దివ్యానుభూతి..

# ప్రసాదం మధురానుభూతి

## సరస్ మేళా..ఆత్మవిశ్వాసానికి,

# ఆర్థిక స్వావలంబనకు వేదిక

6 లో

- గ్రామీణ మహిళా ఉత్పత్తుల సమాహారానికి చిరునామా
- సంప్రదాయ కళలు, చేనేత, హస్తకళలకు చేయూత
- మేళాను సద్వినియోగం చేసుకోండి..
- కళలు, కళాకారులను ప్రోత్సహించండి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



# బ్రాండ్ల కోసం మెటా కొత్త ఫెస్టివ్ ప్లేబుక్



**గాంధీనగర్ అక్టోబర్ 18 మనం న్యూస్:** భారతదేశంలో పండుగల షాపింగ్ను ఐదు నెలల పాటు కొనసాగే వ్యాపార అవకాశంగా మలిచేందుకు మెటా 'ఫెస్టివ్ యాక్సిలరేటర్ 2026: సీఈఓ ప్లేబుక్'ను రూపొందించింది. వినియోగదారుల షాపింగ్ ధోరణులు మారుతున్న నేపథ్యంలో బ్రాండ్లు పండుగల సీజన్ ప్రారంభం నుంచే డిమాండ్ను పెంచుకొని, కొనుగోళ్లను అమ్మకాలుగా మార్చుకునేలా ఈ వ్యూహాత్మక మార్గదర్శిని సహాయపడనుంది. ఆన్లైన్లో తొలిసారిగా షాపింగ్ చేస్తున్న వారిలో 60 శాతం మంది టైర్-2, టైర్-3 నగరాలకు చెందినవారు కాగా, కొనుగోళ్లకు ముందు 86 శాతం మంది సోషల్ మీడియా ద్వారా ఉత్పత్తుల గురించి తెలుసుకుంటున్నారని నివేదిక వెల్లడించింది. పండుగల సమయంలో 85 శాతం మంది వినియోగదారులు ప్రతి వారం మెటా ప్లాట్ఫారమ్లను ఉపయోగిస్తున్నారు. కొత్త ఉత్పత్తులను అన్వేషించేందుకు, షాపింగ్ ఆలోచనలు పొందేందుకు 80 శాతం మంది ఏఐని ఆశ్రయిస్తున్నారు. మెటా ప్లాట్ఫారమ్లలో పండుగలకు సంబంధించిన కంటెంట్ సృష్టి 50 శాతం పెరుగుతుండగా, సోషల్ మీడియా ఎంగేజ్మెంట్ 20 శాతం అధికమవుతోంది. కంటెంట్ క్రియేటర్లు, ఏఐ ఆధారిత ప్రకటనలు, వాట్సాప్ మార్కెటింగ్ వంటి సాధనాలను సమన్వయం చేసుకోవాలని ప్లేబుక్ సూచించింది. దీపావళితోపాటు వివాహాల సీజన్, క్రిస్మస్, ఏడాది ముగింపు, గణతంత్ర దినోత్సవ విక్రయాలను లక్ష్యంగా చేసుకొని నిరంతర ప్రచార వ్యూహాలను అమలు చేయాలని పేర్కొంది.

# చుట్టుపక్క గ్రామాలకు తాగునీరే కరువు

▸▸ **మున్నేరు ఫ్యాక్టరీకేనా?**



**కంచికచర్ల ,అక్టోబర్ 18(మనం న్యూస్):** కంచికచర్ల మండలం గండేపల్లిలో వైరా మున్నేరు నీటి దోపిడీ తీవ్రమైంది. రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కీసర ఎత్తిపోతల పథకానికి నీరు అందకుండా పోయింది. గండేపల్లి సమీపంలోని సేంతిని ఫ్యాక్టరీ యాజమాన్యం హెవీ మోటార్లను ఏర్పాటు చేసి రోజంతా మున్నేరు నీటిని తోడేస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో కీసర పంపు స్కీం పూర్తిగా వట్టిపోయింది. నీరు లేక మిరప, మొక్కజొన్న, వరి పంటలు ఎండిపోతున్నాయి. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయానికే కాకుండా చుట్టుపక్కల గ్రామాలైన గండేపల్లి, కీసర, పెండ్యాల, వేములపల్లి, ఎస్ అమరవరం, గ్రామాల ప్రజలకు తాగునీటికి కూడా కరువు ఏర్పడింది. పశువులకు సైతం తాగడానికి నీరు లేక రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ జలాలు కూడా అడుగంటుతున్నాయి.ఫ్యాక్టరీకి అనుమతించిన దానికంటే ఎక్కువ నీటిని తోడేస్తున్నారని, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించి మున్నేరులో నీటి దోపిడీని అరికట్టాలని, ఫ్యాక్టరీపై కఠిన చర్యలు తీసుకోవాలని, కీసర ఎత్తిపోతల పథకానికి నీరు విడుదల చేయాలని రైతులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# కంచికచర్ల జడ్పిటిసి రేసులో టిడిపి సీనియర్ నాయకుడు మూరకొండ ఏడుకొండలు

**కంచికచర్ల, అక్టోబర్ 18(మనం న్యూస్);** కంచికచర్ల మండలం గని ఆత్కూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, ప్రస్తుత పి.ఎ.సి.ఎస్. చైర్మన్ మూరకొండ ఏడుకొండలు జడ్పిటిసి రేసులో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడినప్పటి నుండి పార్టీ నాయకులందరితో సత్సంబంధాలు కలిగి తలలో నాలుకలా ఉంటున్నారు. మూరకొండ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో ప్రజా ఉపయోగ కార్యక్రమాలు విద్యార్థులకు ఫీజులు అన్నదానాలు, దేవాలయాలకు విరాళాలు, రైతులకు సేవలందిస్తూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంచి పేరు సంపాదించుకున్నారు. దివంగత దేవినేని వెంకటరమణ తంగిరాల ప్రభాకర్ రావు లతో కలిసి పనిచేసిన అనుభవం ఉంది. జడ్పిటిసి తనకు కేటాయించిన యెడల తన ప్రజాసేవను కంచికచర్ల మండలం లో అన్ని గ్రామాలకు విస్తరించి ప్రజలకు ఉపయోగపడే మంచి అభివృద్ధి కార్యక్రమాలు చేసి ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని హామీ ఇస్తున్నారు.



# పరిటాల బీసీ కాలనీలో ఘనంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

▸▸ **5 లక్షల నగదుతో అమ్మవారిని అందంగా అలంకరించిన భక్తులు**

▸▸ **అన్నపూర్ణ దేవి అవతారం, రోజున సుమారు 3000 మందికి అన్నదానం**



**కంచికచర్ల, అక్టోబర్ 18(మనం న్యూస్):** కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలోని బీసీ కాలనీలో గత ఏడు సంవత్సరాల నుంచి శ్రీ దుర్గ మల్లేశ్వరి సేవాసమితి ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రులు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. భక్తుల కొంగు బంగారుతల్లి గా.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా.. ఆపదలో ఆదుకునే అమ్మగా భక్తుల విశ్వాసాన్ని చూరగొంటూ బీసీ కాలనీలో అమ్మవారు కొలువై ఉన్నారు అనే తీరున అమ్మవారి ని ప్రతిరోజు అందంగా అలంకరిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకుని మనసారా ప్రార్థిస్తే తమ కోరికలు నెరవేరుతాయన్న నమ్మకంతో నిత్యం భక్తులు తరలివస్తున్నారు. నిత్యం భక్తి పారవశ్యంతో భక్తులతో కళకళలాడుతోంది. భక్తి పాటలకు చిన్నారులు బతకమ్మ ఆటలతో ఆ ప్రాంతం పండగ వాతావరణం తో సందడిగా మారింది. అమ్మవారికి నిత్య పూజలు, కైంకర్యాలు సాంప్రదాయ రీతిలో కొనసాగుతుండటం విశేషం. నిర్ణీత సమయాల్లో పూజా కార్యక్రమాలు, ప్రత్యేక అలంకరణలు, ధూప దీప నైవేద్యాలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మవారి సన్నిధిలో జరిగే ప్రతి పూజా కార్యక్రమాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను మరింత పెంపొందిస్తోంది.అమ్మవారికి సంబంధించి ఏ కార్యక్రమం నిర్వహించినా నిర్వహకులు అత్యంత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రత్యేక పూజలు, అమ్మవారి విశేష అలంకరణలు తదితర కార్యక్రమాలను భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పద్ధతి ప్రకారం నిర్వహిస్తున్నారు.

# అనుమతుల కోసం ప్రతీ మండలంలో సింగిల్ డెస్క్ ఏర్పాటు

▸▸ **ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ**



**గుంటూరు, అక్టోబర్ 18 : (మనం న్యూస్ ప్రతినిధి) :** ఆదేశించారు. ఇంకా ఎక్కడైనా ఏర్పాటు చేయకపోతే తక్షణం ఏర్పాటు చేయాలని అన్నారు. గుంటూరు నగర పాలక సంస్థ, తెనాలి పురపాలక సంఘంలోనూ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఆదివారం ఉదయం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయాలని అన్నారు. ఎస్.ఎస్.టి బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ లు చురుగ్గా పనిచేయాలని చెప్పారు. రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలు పట్ల స్పష్టత కలిగి ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బంది, లెక్కింపు సిబ్బంది నియామకాలు వెంటనే పూర్తి చేసి శిక్షణ ఇవ్వాలని అన్నారు. ఎన్నికల సాధారణ,వ్యయ, పోలీస్ పరిశీలకులు వస్తున్నారని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను గుర్తించినా, ఎన్నికలకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా ప్రశ్నలు ఉన్నా, వాటిపై ఫిర్యాదులు చేసేందుకు లేదా వివరాలు తెలుసుకునేందుకు 08632 234014 హెల్ప్డెస్క్/కాల్ సెంటర్ ఫోన్ నంబర్ కు ప్రజలు ఫోన్ చేసి సంప్రదించవచ్చని చెప్పారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లోగుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది

▸▸ **జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్**



**గుంటూరు అక్టోబర్18 (మనం న్యూస్ ప్రతినిధి ) :** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసిందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరఫున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు.నామినేషన్ల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు ,సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించారని తెలిపారు. గుంటూరు,తెనాలి నామినేషన్ కేంద్రాలు,పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేసి, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని,ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలు సంయమనం పాటించాలని, పుకార్లను నమ్మవద్దని,సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగిస్తామని,ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీస్ శాఖ పూర్తి అప్రమత్తతతో పనిచేస్తుందని జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందాల్, ఐపీఎస్ గారు స్పష్టం చేశారు.

# సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన సెకండరీ హెల్త్ డైరెక్టర్



**గూడూరు: అక్టోబర్ 18,(మనం న్యూస్):**ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు ఆదివారం గూడూరు మండలంలోని గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, రోగులకు అందిస్తున్న చికిత్సా విధానాలపై ఆరా తీశారు.ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలు, ఇతర రోగులతో ఆయన నేరుగా మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది అందుబాటు, చికిత్సా విధానాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిన్నాపురం గ్రామానికి చెందిన ఎం కీర్తి అనే బాలింతతో మాట్లాడారు. ప్రసవం అనంతరం తల్లి, బిడ్డ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సాధారణ ప్రసవం జరిగిందని, తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని సిబ్బంది వివరించారు.అనంతరం ఆసుపత్రిలోని పలు రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేసి, వాటి నిర్వహణను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలని, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.హెల్త్ డైరెక్టర్ తో పాటు డిసిహెచ్ఎస్ డాక్టర్ శేషు కుమార్, డాక్టర్ కె అరుణ, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.

# అభ్యర్థులు సింగిల్ విండో విధానం ద్వారా ఎన్నికల ప్రచార అనుమతులు తప్పనిసరి

▸▸ నగర కమిషనర్



**గుంటూరు నగర పాలక సంస్థ అక్టోబర్ :18 (మనం న్యూస్ ప్రతినిధి )** ఎన్నికల ప్రచారంలో భాగంగా సంబంధిత అధికారుల అనుమతి అవసరమయ్యే వివిధ కార్యక్రమాలను నిర్వహించడానికి పోటీ చేసే అభ్యర్థులు లేదా వారి అధీకృత ఎన్నికల ఏజెంట్లు 'సింగిల్ విండో అనుమతుల విధానం' ద్వారా ముందస్తు అనుమతి పొందాలని, నగరంలో ఎన్నికల నిబంధనలు పక్కా అమలుకు పోలీస్ ప్రత్యేక నిఘా బృందాలు పర్యవేక్షిస్తున్నాయని,ఇప్పటికే నగరంలో ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన వారి పై రెండు కేసులు నమోదు అయ్యాయని నగర కమిషనర్ మరియు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ తెలియచేశారు.బహిరంగ ప్రదేశాలలో ఎన్నికల ప్రచార సభలు,రాజకీయ ర్యాలీలు, రోడ్ షోలు,పాదయాత్రలు మరియు ఊరేగింపులు నిర్వహించడానికి,అలాగే మైకులు,పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్,ధ్వని ప్రసార పరికరాల వినియోగం ఎన్నికల ప్రచార సభల కోసం ఏర్పాటు చేసే వాటికి ఈ సింగిల్ విండో ద్వారా ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ఇందుకోసం నగర పాలక సంస్థ ఉపా సెల్ నందు నగర పాలక సంస్థ మరియు పోలీస్ అధికారుల సమన్వయంతో ప్రత్యేక సింగల్ విండో కౌంటర్ ఏర్పాటు చేశామని, ఈ కౌంటర్ ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు అందుబాటులో ఉండి దరఖాస్తు చేసిన 24 గంటలలో అనుమతులు మంజూరు చేస్తారన్నారు. అంతేకాక ప్రచార వాహనాలకు సంబంధిత రిటర్నింగ్ అధికారి యొక్క అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

# ఎన్నికల నిబందనల మేరకు ప్రణాళికాబద్ధమైన నిఘాతో అభ్యర్థుల ఖర్చులు పరిశీలించి,రికార్డ్ చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు నందిని సలారియా సూచించారు



**గుంటూరు అక్టోబర్ :18 (మనం న్యూస్ ప్రతినిధి)** నగరపాలక సంస్థ పరిధిలో జరిగే ఎన్నికల్లో నిర్దేశిత ఎన్నికల నిబందనల మేరకు ప్రణాళికాబద్ధమైన నిఘాతో అభ్యర్థుల ఖర్చులు పరిశీలించి,రికార్డ్ చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు నందిని సలారియా సూచించారు.నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ తో కలిసి ఆదివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్స్, అకౌంటింగ్ టీమ్ తో ఎన్నికల వ్యయ నమోదుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కమిషనర్ మాట్లాడుతూ,18వ తేదీతో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందని,28న పోలింగ్ జరుగుతుందన్నారు.ఎన్నికల సంఘం నిబందనల మేరకు మేయర్ అభ్యర్థి రూ.25 లక్షలు,కార్పొరేటర్ అభ్యర్థి రూ.10 లక్షలు ఖర్చు చేసుకోవచ్చని తెలిపారు. రిటర్నింగ్ అధికారుల పరిధిలో పోటీ చేసే అభ్యర్థులకు ఇప్పటికే ఒకసారి ఖర్చులపై అవగాహన కల్గించామని, మరలా ఒక్కసారి అవగాహన కల్గించాలని ఆదేశించామన్నారు. అలాగే అభ్యర్థులు ఇచ్చే ఖర్చుల రిజిస్టర్ కాకుండా,అకౌంటింగ్ సిబ్బంది షాడో రిజిస్టర్ నిర్వహించాలన్నారు. నిబందనలకు మించి నగదుతో ఉన్నా,సరైన బిల్లులు, వివరాలు లేకుండా గిఫ్ట్ ఆర్టికల్స్ క్యారీ చేసిన సీజ్ చేయాలన్నారు. 10 లక్షలకు మించి నగదుతో ఎవరైనా దొరికితే జీఎస్టీ అధికారులకు తెలియచేయాలని,ఇప్పటికే 4 మందిపై ఎఫ్ఐఆర్ లు నమోదు చేశామని తెలిపారు. అబ్జర్వర్ మాట్లాడుతూ, సిబ్బంది ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను సమగ్రంగా అధ్యయనం చేయాలన్నారు.నిబందలను తుచ తప్పకుండా పాటిస్తూ జిఎంసి ఎన్నికలు గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అతి తక్కువ సమయం ఉంది కనుక ప్రతి ఒక్కరూ విజిలెంట్ గా ఉండాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపయోగించే వివిధ వాహనాలు, కరపత్రాలు, మరియు జెండాలకు సంబంధించిన ఖర్చులు అభ్యర్థి వ్యయంలోకే వస్తాయన్నారు.సమావేశంలో జిల్లా ఆడిట్ అధికారి శ్రీకాంత్, జిఎంసి ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఎలిషా,అకౌంట్స్ అధికారి తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు పాటించాలి



▸▸ శాంతిభద్రతలకు సహకరించాలి

▸▸ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

**పల్నాడు చిలకలూరిపేట అక్టోబర్ 18 (మనంప్రతినిధి):** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా చిలకలూరిపేట మున్సిపాలిటీకి జనసేన పార్టీ అభ్యర్థిగా తోట రాజా రమేష్ సతీమణి తోట రాజరాజేశ్వరి నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ నాయకులు,కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మీడియాతో మాట్లాడుతూ, చిలకలూరుపేట మున్సిపాలిటీలో టీడీపీకి ఉన్న రాజకీయ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, కూటమి పార్టీల మధ్య సమన్వయం, అన్ని పార్టీలకు ప్రాతినిధ్యం కల్పించే ఉద్దేశంతో ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో నాయకులు,కార్యకర్తలు సంయమనం పాటించాలని, ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా గౌరవించాలని ఎంపీ సూచించారు. నామినేషన్ల ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, శాంతిభద్రతలకు ఆటంకం కలిగించినా చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు,కార్యకర్తలను గుర్తుంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనవసరమైన వివాదాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలని,ఇలాంటి ఘటనల వల్ల కార్యకర్తలతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హితవు పలికారు.రాజరాజేశ్వరి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటూ పార్టీ విజయానికి కృషి చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పిలుపునిచ్చారు.

# గిద్దలూరు మున్సిపాలిటీలో బీజేపీ విజయం ఖాయం

▸▸ సోము వీర్రాజు రాకతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

▸▸ బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**గిద్దలూరు,అక్టోబర్,18,(మనం న్యూస్):** మార్కాపురం జిల్లా గిద్దలూరు మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి డాక్టర్ జేవీ నారాయణ విజయం ఖాయమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ జేవీ నారాయణ నామినేషన్ దాఖలు చేసిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిద్దలూరు మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరడం తథ్యమని, ప్రజల మద్దతుతో పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఈ కార్యక్రమానికి హాజరుకావడం పార్టీ శ్రేణుల్లో ఎనలేని ఉత్సాహాన్ని నింపిందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోము వీర్రాజు సుదీర్ఘ రాజకీయ అనుభవం, పార్టీ పట్ల అంకితభావం, కార్యకర్తలకు అందించే ప్రోత్సాహం బీజేపీకి గొప్ప బలమని కొనియాడారు. ఆయన రాకతో గిద్దలూరులో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో, కార్యకర్తలను సమన్వయం చేయడంలో ఆయన అనుభవం ఎంతో విలువైనదని అన్నారు. గిద్దలూరు పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా డాక్టర్ జేవీ నారాయణకు ప్రజలు అండగా నిలిచి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏలూరి రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎన్డీఏ కూటమి అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాగా నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరు కాగా, టీడీపీ ఎన్నికల పరిశీలకులు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, బీజేపీ మార్కాపురం జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థుల గెలుపుతో క్షేత్రస్థాయి అభివృద్ధి

▸▸ మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు,అక్టోబర్,18,(మనం న్యూస్):** నిడదవోలు మున్సిపాలిటీ ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపి కూటమి చైర్పర్సన్ అభ్యర్థిగా మురల జ్యోతి ఆదివారం మున్సిపల్ ఆఫీస్లో రిటర్నింగ్ ఆఫీసర్కు నామినేషన్ పత్రాలను అందజేశారు. రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ, సాంస్క ృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. అంతకుముందు 'ఐ లవ్ నిడదవోలు' సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కూటమి నాయకులు, శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించారు. నిబంధనల ప్రకారం నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థులతో పాటు ఇద్దరు ప్రతినిధులు మాత్రమే లోపలికి వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ.. మూడు పార్టీల ఏకాభిప్రాయంతో నిడదవోలులోని 32 వార్డుల్లోనూ కూటమి తరపున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. .కేవలం ఈ రెండేళ్లలోనే నిడదవోలు రూపురేఖలు మారుతున్నాయని ప్రజలే స్పష్టం చేస్తున్నారు.. రెండేళ్ల క్రితం ఉన్న పరిస్థితులకు, ఇప్పటి మార్పునకు వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలి. రాబోయే మూడు నెలల్లో ఆర్ఓబీ నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. దశాబ్దాలుగా ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. పట్టణంలో రహదారులు, డ్రైన్ల నిర్మాణం, పట్టణ సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో నిడదవోలు బస్టాండును ఆధునికీకరించి, పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయికి చేరాలంటే స్థానిక సంస్థల్లో కూటమి విజయం అత్యంత ఆవశ్యకం.కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తాం. కూటమి తరపున పోటీ చేస్తున్న చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్, కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి, నిడదవోలు పట్టణాభివృద్ధికి సహకరించాలని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా ప్రజలను కోరారు.

# నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడి



**గుంటూరు అక్టోబర్18 (మనం న్యూస్ ప్రతినిధి):** జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లాలో పేకాట స్థావరాలపై విస్తృత దాడులు, 18.10.2026 ఆదివారం సాయంత్రం 4:40 గంటలకు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రకాష్ నగర్లో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. ఎస్పీ డీఎస్పీ కి సమాచారం అందించి, టాస్క్ ఫోర్స్ సీఐ-2 పర్యవేక్షణలో నల్లపాడు ఎస్ఐ సురేష్ ,పోలీసు సిబ్బందితో కలిసి సదరు ఇంటి రెండో అంతస్తులో తనిఖీలు చేపట్టారు.ఈ దాడిలో పేకాట నిర్వహిస్తున్నట్లు గుర్తించిన బోడపాటి ముఖర్జీ (గౌతమి నగర్)తో పాటు మొత్తం 9 మంది వ్యక్తులను గుర్తించి, వారి వద్ద నుంచి 9 సెల్ఫోన్లు, రూ.51,800 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల నిమిత్తం పట్టుబడిన వ్యక్తులను, స్వాధీనం చేసుకున్న నగదు, సెల్ఫోన్లను నల్లపాడు పోలీస్ స్టేషన్కు అప్పగించారు.

# కాంగ్రెస్ పార్టీని ఆదరించి మేయర్ పీఠాన్ని ఇవ్వండి



**▶▶ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి**

**నెల్లూరు, అక్టోబర్ 18 (మనం న్యూస్):** నెల్లూరు కార్పొరేషన్ మేయర్ పీఠానికి సంబంధించి నామినేషన్లో భాగంగా చివరి రోజు కాంగ్రెస్ పార్టీ భారీ స్థాయిలో కార్యకర్తలతో తరలివచ్చి మేయర్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... తన జీవితంలో ఇంత అత్యంత దారుణంగా ఎన్నికలు జరగటం ఇదే మొదటిసారి అన్నారు. ఎన్నికల కమిషన్ అట్టర్ ఫ్లాప్ అయింది అన్నారు. బిజెపి పార్టీ ఏది చెబితే అది చేయటమే ఎన్నికల కమిషన్ విధిగా ఉందన్నారు. నెల్లూరు నగరంలోని ప్రతి ఫ్లైఓవర్ గానీ బ్రిడ్జి కానీ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం గానీ అన్ని కూడా దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి హయంలోనే ఏర్పాటు చేసినవి అన్నారు.రాష్ట్రంలో గానీ కేంద్రంలో గాని ప్రజలు ఆనందంగా సుఖసంతోషాలతో జీవించాలంటే కేంద్రంలో రాహుల్ గాంధీ నాయకత్వం.. రాష్ట్రంలో షర్మిల నాయకత్వం లో ప్రభుత్వాలు పనిచేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మేయర్ ఎలక్షన్కు సంబంధించి నామినేషన్ వేసిన తర్వాత రిజెక్ట్ అయితే కనీసం ఆపిల్ కు కూడా వెళ్లకుండా చేయడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి అన్నారు. నెల్లూరు ప్రజలు చాలా తెలివిగలవారిని ఆలోచించి మంచి నాయకుడిని మేయర్గా ఎన్నుకుంటారని ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. బలం ఉన్నచోట తమ అభ్యర్థులు నిలబడతారని ఆయన అన్నారు. నెల్లూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ చాలా బలంగా ఉందన్నారు.వచ్చే సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో..కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్నారు..బీజేపీ ప్రభుత్వాన్ని..కూటమి ప్రభుత్వాంను పొరపాటున కూడా నమ్మవద్దని కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు

# ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలోకి భారీగా చేరికలు



**కావలి, అక్టోబర్ 18 (మనం న్యూస్):** నెల్లూరు జిల్లా,కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి భారీ చేరికలు పెరుగుతున్నాయి. బోగోలు మండలం బోగోలు మేజర్ పంచాయతీ కప్పరాల తిప్ప గ్రామానికి చెందిన పసుపులేటి సుధాకర్ ముఖ్య అనుచరుడు పీట్ల ప్రత్యూష్,పీట్ల దయాకర్, గొడ్డేటి ప్రకాష్,ఆవుల బాబు, గోగుల రాజు, బాణాల ఆదర్శ్, గోగుల నవీన్,తో పాటు ఆయన అనుచరులైన 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి.కావలిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడూతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న సంక్షేమ పాలన, నియోజకవర్గంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అందిస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై తామంతా టీడీపీలోకి చేరామని వెల్లడించారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి, ఎమ్మెల్యే సారథ్యంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సోమశిల మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు గారు, బోగోలు పిఎసిఎస్ ప్రెసిడెంట్ చిలకపాటి వెంకటేశ్వర్లు, గోచిపాతల సంజయ్, అద్భుత రాజ్, ఆకుల డేవిడ్ పాల్ వెంకటస్వామి, పుచ్చకాయల రమేష్, ఎస్ ఎస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి క్లీన్ స్వీప్ చేయబోతోంది

**▶▶ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు పశ్చిమ అక్టోబర్: 18 (మనం న్యూస్ ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) ఘన విజయం సాధించి క్లీన్ స్వీప్ చేయబోతోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ మరియు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఎన్డీయే కూటమి బలపరిచిన 27వ డివిజన్ అభ్యర్థి ఉల్లి గోపాల్ కృష్ణ, 34వ డివిజన్ అభ్యర్థి గాలం వెంకటేశ్వర్లు, 31వ డివిజన్ అభ్యర్థి గంటా మౌళిక, 48వ డివిజన్ అభ్యర్థి మానం శ్రీనివాస్,29 డివిజన్ షేక్ షర్మిల నామినేషన్ల కార్యక్రమాలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పత్తిపాడు ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయులు, హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే ఎన్డీయే కూటమి అభ్యర్థులకు బలమని, ప్రజల ఆదరణతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

# గుంటూరు కార్పొరేషన్ ఎన్నికల్లో ఉత్సాహంగా సీపీఐ అభ్యర్థుల నామినేషన్లు



**గుంటూరు: అక్టోబర్ :18 (మనం న్యూస్ ప్రతినిధి )**గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో సీపీఐ తరపున తొమ్మిది మంది అభ్యర్థులు ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేశారు. మేళతాళాలు, పార్టీ నినాదాల మధ్య పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అభ్యుదయవాదులు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.బొమ్మల సెంటర్ 21వ డివిజన్ నుంచి చిన్న పోతుల వెన్నెల, పాతగుంటూరు 6వ డివిజన్ నుంచి జంగాల చైతన్య, అశోక్ నగర్ 46వ డివిజన్ నుంచి ఓలేటి సుశీల,47వ డివిజన్ నుంచి నిమ్మల విమల, శివనాగరాజు కాలనీ 72వ డివిజన్ నుంచి బండారపు యశ్వంత్ రఘువీర్ శశి, 1వ డివిజన్ నుంచి చల్లా మరియాదాస్, సీఆర్ నగర్ 35వ డివిజన్ నుంచి శివమ్మ, ప్రగతినగర్ 5వ డివిజన్ నుంచి అంకమ్మ, 39వ డివిజన్ నుంచి బి. వెంకటేశ్వర రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ గుంటూరు నగర అభివృద్ధికి సీపీఐ అభ్యర్థుల గెలుపు ఎంతో అవసరమని పేర్కొన్నారు. నగరం, పరిసర ప్రాంతాల అభివృద్ధిలో సీపీఐ నాయకులు అనేక దశాబ్దాలుగా కీలక పాత్ర పోషించారని తెలిపారు. శారదా కాలనీ,మంగళదాస్ నగర్, ఇందిరానగర్, ప్రగతినగర్, సీఆర్ నగర్, మాలకొండయ్య నగర్,కొండా వెంకటప్పయ్య కాలనీ, చుట్టుగుంట, పాతగుంటూరు, చాకలిగుంట ,సంగడిగుంట, అశోక్ నగర్,ఏటీ అగ్రహారం తదితర ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి,కార్మిక వర్గ ప్రజలకు సీపీఐ అనేక సేవలందించిందన్నారు. మున్సిపల్ కార్మికులు, ముఠా కార్మికులు, గతంలో పొగాకు కార్మికులను సంఘటితం చేసి వారి హక్కుల సాధన కోసం సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించిందని ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, కార్మికుల హక్కుల పరిరక్షణ, పేద ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా సీపీఐ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు.సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బందెల నాసర్ జీ వివిధ డివిజన్లలో నామినేషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్,జిల్లా సహాయ కార్యదర్శులు చిన్ని, తిరుపతయ్య మాట్లాడుతూ నగరంలోని అన్ని వర్గాల ప్రజల మద్దతుతో సీపీఐ అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడా హనుమంతరావు,నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు,సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, జి.సురేష్ బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ వలి, సీపీఐ నగర సమితి సభ్యులు పరిమళ స్నీ, ఆకిటి రామచంద్రుడు,సిపిఐ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీకి గుడ్ బై... టీడీపీలో చేరిక

**▶▶ ప్రత్తిపాడు నియోజకవర్గంలో డీలా పడిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ**

**▶▶ జోష్ అందుకున్న తెలుగుదేశం**



**గుంటూరు అక్టోబర్: 18 (మనం న్యూస్ ప్రతినిధి)** నియోజకవర్గంలో ఎమ్మెల్యే రామాంజనేయులు చేస్తున్న అభివృద్ధిని మెచ్చి రాజుపాలెం గ్రామానికి చెందిన 25 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక.పెదనందిపాడు మండలం,రాజు పాలెం గ్రామం నుండి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి సంబందించిన బలమైన పంచాయతీలలో ఒక్కటైన రాజుపాలెం గ్రామం నుండి షుమారు 25 ఏస్సి కుటుంబాల నుండి 110 మంది నాయకులు,కార్యకర్తలు మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మరియు కూటమి ప్రభుత్వం చేబట్టిన అభివృద్ధి (ప్రతి ఇంటి ముందు రోడ్డు, డ్రైనేజ్, త్రాగు మరియు సాగు నీరు, ప్రధాన రహదారులకు కొనసెక్టివిటీ, వీధి దీపాలు, శ్మశానవాటికల అభివృద్ధి) మరియు సంక్షేమ పథకాలు (ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ,అన్న కాంటీన్లు, దీపం పథకం,స్త్రీ శక్తి) కార్యక్రమాల పట్ల, ఆకర్షితులయి ప్రత్తిపాడు శాసనసభ్యుడు డా. బూర్ల రామాజనేయులు,సమక్షంలో ఆదివారం తెలుగు దేశం పార్టీ లో చేరడం జరిగినది. తెలుగు దేశం పార్టీ లో చేరిన వారు ముక్త కంఠంతో ఒకేమాటగా తెలియజేస్తూ మన ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, అనునిత్యం ప్రజలలో ఉంటూ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, గ్రామాల అభివృద్ధి కొరకు తీసుకుంటున్న ప్రతి అంశాన్ని ప్రతి గ్రామంలో అమలయ్యేలా తీసుకుంటున్న చర్యలు అద్భుతం అని,ఇంతటి సమగ్ర మరియు వేగవంతమైన అభివృద్ధి ని గతంలో చూడలేదని, అందుకని ప్రతి పౌరుడు తెలుగుదేశం పార్టీ కి చేయుతనందించి అభివృద్ధిలో పాలుపంచుకోవాలసిన బాధ్యత మానందరిపై ఉన్నది అని,కావున రాజుపాలెం గ్రామం నుండి మేముఅందరం తెలుగుదేశం పార్టీ లో చేరడం గర్వకారణమని తెలియజేయడం జరిగినది.

# ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



**▸▸ విధుల్లో అశ్రద్ధ, అజాగ్రత్తకు ఏమాత్రం తావివ్వకూడదు**

**▸▸ అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, గుంటూరు నగర కమిషనర్**

**గుంటూరు అక్టోబర్ :18 (మనం న్యూస్ ప్రతినిధి)** నగరపాలక సంస్థ ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, విధుల్లో అశ్రద్ధ, అజాగ్రత్తకు ఏమాత్రం తావివ్వకూడదని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, గుంటూరు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. అదివారం నగరపాలక సంస్థప్రధాన కార్యాలయం లోని కమిషనర్ చాంబర్ లో ఎన్నిల ఏర్పాట్లపై అదనపు కమిషనర్లు,డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతు లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రస్తుతం బ్యాలెట్ పేపర్ మినహా అన్ని రకాల మెటీరియల్ మరో రెండు రోజుల్లో సిద్ధం చేసుకోవాలని,అందుకు విధులు కేటాయించబడిన అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. మెటీరియల్ ని పలుమార్లు తనిఖీ చేసుకొని నిర్ధారణ చేసుకోవాలన్నారు. పిఓలు, ఏపీఓలకు శిక్షణా సమయంలోనే పిఓ హ్యాండ్ బుక్స్ అందించాలని మేనేజర్ ని ఆదేశించారు .కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను వేగవంతం చేయాలని, అందుకు ప్రత్యేకంగా ఇంజినీరింగ్ అధికారులకు విధులు కేటాయించాలని ఎస్ఈని ఆదేశించారు.ఓటర్ స్లిప్ లను త్వరగా ప్రింట్ చేయించాలని సిటి ప్లానర్ ని, పోలింగ్ కేంద్రాలను రూట్ ఆఫీసర్లతో కలిసి,ముందుగా బస్ లో ట్రయిల్ రన్ చేయాలనీ డిసిపిని ఆదేశించారు.ఎన్నికల విధుల్లో ఎక్కడా లోపాలు తలెత్తడానికి వీలు లేదని, ఎప్పటికప్పుడు ప్రతి విభాగం సమన్వయం చేసుకుంటూ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఏ సమస్య ఎదురైనా తక్షణం తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్లు ఐ.కిషోర్, జి.రవీంధ్ర (జిఎస్డబ్ల్యూ), డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఈఓఐ ఎలిషా,సిటి ప్లానర్ డి.రాంబాబు, ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు,డిసిపి సూరజ్ కుమార్, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

# ఆత్మకూరులో రూ.350 కోట్ల దోపిడీ




**▸▸ సోమశిల ఆఫ్రాన్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే**

**▸▸ వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ధ్వజం**

**ఆత్మకూరు, అక్టోబర్ 18 (మనం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తెలుగుదేశం పార్టీకి అభ్యర్థులు కరువయ్యారా? గెలుపు కోసం కుటుంబాలను చీల్చి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం ఎంతవరకు సమంజసమని వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్రెడ్డి ప్రశ్నించారు. రాజకీయాలు ప్రజల కోసం చేయాలే తప్ప, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కుటుంబాల మధ్య చిచ్చుపెట్టడం తగదని హితవు పలికారు. అల్లారెడ్డి ఇందుమతిని వైఎస్సార్సీపీ అభ్యర్థిగా నిలబెట్టామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసే నాయకులను ప్రజలు ఆదరించాలని కోరారు. విజయదశమి స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విక్రమ్రెడ్డి విమర్శించారు. ఎన్నికల ముందు గొప్పగా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలతో పాటు ఇతర హామీలకూ దిక్కులేకుండా పోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో సుమారు రూ.350 కోట్ల మేర దోపిడీ జరిగిందని, ప్రకృతి వనరులను అడ్డగోలుగా కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకుండా స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నారని మండిపడ్డారు. సోమశిల ఆఫ్రాన్ పనులు రెండేళ్లుగా ఒక్క అడుగు కూడా ముందుకు సాగకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కీలకమైన పనులు నిలిచిపోతుంటే పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో ప్రచార ఆర్భాటాలు చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కూటమి పాలనలో సామాన్యుడి బతుకు మరింత భారంగా మారిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని మోసం చేశారని ఆరోపించారు.కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరిగిన మోసాన్ని ప్రతి గ్రామంలోనూ, ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని విక్రమ్రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్సీపీ నిరంతరం పోరాడుతుందని, ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని నిలదీస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వానికే ఆదరణ ఉంటుందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలే కూటమి ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# దర్శనం దివ్యానుభూతి.. ప్రసాదం మధురానుభూతి

**▸▸ అమ్మవారి అనుగ్రహానికి మధుర ప్రతీక..**

**▸▸ కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదం!**

**▸▸ ఇంద్రకీలాద్రి ప్రసాదానికి విశిష్ట ఆదరణ..**

**▸▸ భక్తి, సంప్రదాయం, మాధుర్యాల సమ్మేళనం**

**విజయవాడ,అక్టోబర్,18,(మనం న్యూస్):** ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గమ్మవారి దర్శనం అనంతరం భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో స్వీకరించే ప్రసాదాల్లో లడ్డూ ప్రసాదానికి ప్రత్యేక స్థానం ఉంది. అమ్మవారి సన్నిధిలో లభించే ఈ మధుర ప్రసాదం భక్తులకు కేవలం తీపి పదార్థం మాత్రమే కాదు.. జగజ్జనని కరుణాకటాక్షాలను స్మరించుకునే ఆధ్యాత్మిక అనుభూతి.

## ప్రసాదం వెనుక భక్తిభావం

సంప్రదాయంలో నైవేద్యానికి విశిష్ట స్థానం ఉంది. భగవంతునికి సమర్పించిన పదార్థాన్ని ప్రసాదంగా స్వీకరించడం దైవానుగ్రహానికి ప్రతీకగా భావిస్తారు. ఆ విశ్వాసమే ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదాన్ని భక్తుల హృదయాలకు చేరువ చేస్తోంది. అమ్మవారిని దర్శించుకుని, ప్రసాదాన్ని స్వీకరించి, తమ కుటుంబ సభ్యులతో పంచుకోవడంలో భక్తులు ఆత్మీయమైన ఆనందాన్ని పొందుతారు.

## మాధుర్యాన్ని పంచే ప్రత్యేక తయారీ

లడ్డూ తయారీలో శనగపిండి, పంచదార పాకం, జీడిపప్పు, యాలకుల పొడి వంటి పదార్థాలను జాజికాయ పొడి, తినదగిన పచ్చకర్పూరం వంటి పదార్థాలు ప్రత్యేక రుచిని అందిస్తాయి. ప్రసాదం తయారీలో నాణ్యమైన ముడి పదార్థాల వినియోగం, పరిశుభ్రత, రుచి,



నిర్ణీత పరిమాణం వంటి అంశాలు కీలకం. దసరా వంటి విశేష పర్వదినాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా లడ్డూల తయారీ, పంపిణీపై దేవస్థానం ప్రత్యేక దృష్టిసారిస్తూ వస్తోంది.

## జై శ్రీ కనకదుర్గమ్మ!

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా మహోత్సవాలు - 2026 సందర్భంగా భక్తుల సౌకర్యార్థం విస్తృతంగా అమ్మవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు - ప్రత్యేక ఏర్పాట్లు.ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ సంవత్సరం దసరా మహోత్సవాలు 11-10-2026 నుండి 20-10-2026 వరకు జరుగుతుండగా ఈ ఉత్సవాలకు సుమారు 25 లక్షల మంది భక్తులు మరియు భవానీ భక్తులు విచ్చేస్తారని అంచనా వేశారు. భక్తులకు అత్యంత ప్రీతిపాత్రమైన లడ్డు ప్రసాదం అందించేందుకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మొత్తం 19 ప్రసాదం కౌంటర్లను అందుబాటులో ఉంచడమైనది.

ప్రధాన కౌంటర్లు: 11 (9 సాధారణ కౌంటర్లు + 2 ఆన్లైన్ కౌంటర్లు), ఏటీఎం లడ్డూ కౌంటర్: రైల్వే స్టేషన్ కౌంటర్లు: 3 బస్టాండ్ కౌంటర్లు: 2 కొండపై వీఐపీ లడ్డూ కౌంటర్: 1 అత్యవసర/ఇతర పాయింట్లు : 4 గత 7 రోజుల లడ్డూ విక్రయాల వివరాలు (11-10-2026 నుండి 17-10-2026 వరకు): మొదటి రోజు: 1,45,186 రెండవ రోజు: 1,20,783 మూడవ రోజు: 1,48,119 నాల్గవ రోజు: 1,67,711 ఐదవ రోజు: 2,17,730 ఆరవ రోజు: 3,15,342 ఏడవ రోజు: 3,02,522 మొత్తం ఇప్పటివరకు విక్రయించిన లడ్డూలు: 14,11,393

## రాబోయే రోజులకు ముందస్తు ఏర్పాట్లు:

తేదీ 18-10-2026 నుండి 23-10-2026 వరకు భవానీ భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, లడ్డూల విక్రయాలు భారీగా పెరుగుతాయని అంచనా వేయడమైనది. మరో 30 లక్షల లడ్డు ప్రసాదం తయారుకు ప్రణాళిక కలిగియున్నారు.భక్తుల రద్దీకి అనుగుణంగా ఎక్కడా కొరత రాకుండా నిరంతరం లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉండేలా దేవస్థానం తరపున అన్ని ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం 6లడ్డు బాక్స్, 3లడ్డు బాక్స్, సింగిల్ లడ్డు గా అందుబాటులో ఉండగా భక్తులు కోరిన ప్రకారం అందజేస్తున్నారు.



# గుంటూరు మేయర్ రేసులో పేరు వినిపించినా.కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా ముందడుగు



**గుంటూరు అక్టోబర్ :18 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు నగర రాజకీయాల్లో ఐక్యతకు ప్రాధాన్యమిస్తూ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు,జనచైతన్య గ్రూప్ అధినేత మాదల చైతన్య, ఆయన సతీమణి మాదల మీనా రత్న,తమ రాజకీయ పరిణతిని చాటుకున్నారు. గుంటూరు నగర కూటమి మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్ర (నాని) సతీమణి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని, కూటమి అభ్యర్థికి మద్దతుగా నిలిచారు.మేయర్ రేసు నుంచి.కూటమి అభ్యర్థికి మద్దతు వరకు!గుంటూరు మేయర్ పదవికి సంబంధించి గత కొంతకాలంగా మాదల మీనా రత్న పేరు కూడా రాజకీయ వర్గాల్లో ప్రముఖంగా వినిపించింది. మేయర్ అభ్యర్థిత్వంపై చర్చల్లో ఉన్నప్పటికీ, కూటమి అధిష్ఠానం కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు అవకాశం కల్పించిన నేపథ్యంలో మాదల చైతన్య, మీనా రత్న దంపతులు పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ నామినేషన్ కార్యక్రమానికి హాజరు కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. వ్యక్తిగత ఆశయాల కంటే పార్టీ ఐక్యతకు, కూటమి బలోపేతానికి ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని ఈ సందర్భంగా వారు చాటినట్లయింది.మేయర్ పదవికి తమ కుటుంబం నుంచి అవకాశం దక్కకపోయినా, కూటమి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడం గుంటూరు రాజకీయాల్లో ప్రత్యేక చర్చకు దారితీసింది.అగ్రనేతల సమక్షంలో నామినేషన్ సందడి.కోవెలమూడి లక్ష్మీ అపర్ణ నామినేషన్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన నాయకుడు కిలారి రోశయ్య,బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు,గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు,మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, భ్రమర గ్రూప్ ఎండీ గళ్ళా రామచంద్రరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వారితో పాటు కూటమి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నామినేషన్ కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాదల చైతన్య, మాదల మీనా రత్న దంపతులు పాల్గొనడం రాజకీయంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది..గుంటూరు నగర రాజకీయాల్లో యువ నాయకుడిగా చురుకుగా వ్యవహరిస్తున్న మాదల చైతన్య, తన సతీమణి మీనా రత్నతో కలిసి కూటమి అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా పార్టీ ఐక్యతకు ప్రాధాన్యమిచ్చారు.మేయర్ అభ్యర్థిత్వంపై సాగిన చర్చలకు భిన్నంగా,ఇప్పుడు కూటమి అభ్యర్థి విజయం కోసం నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపైకి రావడం గుంటూరు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా నిలిచింది.

## శ్రీ దుర్గాదేవి అలంకారంలో అమ్మవారిని
# పెద్దఎత్తున దర్శించుకున్న భక్తులు

**విజయవాడ,అక్టోబర్,18,(మనం న్యూస్):** ఇంద్రకీలాద్రిపై దుర్గాదేవి అలంకారంలో దర్శనమిస్తున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన క్యూలైన్ల నిర్వహణ, భక్తుల భద్రత, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు పంపిణీతోపాటు చిన్నారులకు పాలు అందిస్తున్నారు. అన్నప్రసాద పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేపట్టడంతోపాటు ఆలయ పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు పోలీసు సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థల ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, క్యూలైన్లలో భక్తులు క్రమశిక్షణ పాటించేలా చర్యలు చేపడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా సంబంధిత సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, పాలకమండలి ఛైర్మన్ బొర్రా గాంధీ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతూ ఉత్సవాల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు.




# రాధా X రాయన



**బెజవాడలో భీకరపోరు**

**(విజయవాడ,మనం బ్యూరో చీఫ్):** ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఘట్టం ముగిసిన తర్వాత అంతటి ప్రాధాన్యత సంతరించుకున్న విజయవాడ కార్పొరేషన్ పోరు ఇప్పుడు సరికొత్త సమీకరణాలకు వేదికైంది. మొన్నటివరకు టీడీపీలో ఉండి, ఊహించని విధంగా జనసేన కండువా కప్పుకున్న వంగవీటి రాధాను కూటమి తమ ఉమ్మడి మేయర్ అభ్యర్థిగా ప్రకటించి బెజవాడ రాజకీయాల్లో పెద్ద బాంబు పేల్చింది. వంగవీటి కుటు ంబానికి నగరంలో ఉన్న బలమైన సామాజిక, భావోద్వేగ ఓటు బ్యాంకును క్యాష్ చేసుకునేందుకు జనసేనాని పవన్ కల్యాణ్ పక్కా స్కెచ్ వేశారు. మరోవైపు, గత ఐదేళ్లు మేయర్గా పనిచేసిన అనుభవం, బీసీ (నగరాల) సామాజికవర్గ సమీకరణ బలం ఉన్న రాయన భాగ్యలక్ష్మిపై నమ్మకంతో వైఎస్సార్సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆమెకు రెండోసారి అవకాశం ఇచ్చారు. ఒకవైపు వంగవీటి వారసత్వ ఇమేజ్, కూటమి బలం... ఇంకోవైపు సిట్టింగ్ మేయర్ ఇమేజ్, క్షేత్రస్థాయి క్యాడర్ బలం నడుమ బెజవాడ మున్సిపల్ యుద్ధం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లోనే మోస్ట్ ఇంట్రెస్టింగ్ టాపిక్గా మారింది.

### చంద్రబాబు – పవన్ కల్యాణ్ పక్కా ప్లాన్

రాధా జనసేనలో చేరడం, మేయర్ అభ్యర్థిగా ప్రకటించడం వెనుక చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ల వ్యూహాత్మక ఒప్పందం ఉంది. అందువల్ల పైస్థాయి నుండి టీడీపీ శ్రేణులకు 'రాధా గెలుపు కోసం పని చేయాలి' అనే స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. విజయవాడ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి, స్థానిక కొందరు సీనియర్ టీడీపీ నేతలకు దశాబ్దాలుగా రాజకీయ వైరుధ్యం ఉంది. రాధా గతంలో టీడీపీలో ఉన్నప్పటికీ, ఇప్పుడు జనసేన అభ్యర్థిగా రావడాన్ని గ్రౌండ్ లెవెల్లో కొంతమంది కట్టా క్యాడర్ ఎలా రిసీవ్ చేసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. మేయర్ స్థానంతో పాటు డివిజన్లలో కార్పొరేటర్లుగా పోటీ చేసే టీడీపీ అభ్యర్థుల గెలుపు కూడా రాధాకు ముఖ్యం. డివిజన్లలో టీడీపీ అభ్యర్థులు తమ ఓట్లతో పాటు మేయర్ ఓటు కూడా కూటమికే పడేలా ప్రచారం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి అధికారికంగా అందరూ రాధాకు మద్దతు ప్రకటిస్తున్నారు.విజయవాడ తూర్పు,



సెంట్రల్ నియోజకవర్గాల్లోని కీలక టీడీపీ నేతలు వంగవీటి రాధాతో వ్యక్తిగతంగా మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. రాధాకృష్ణకు ఉన్న సాఫ్ట్ ఇమేజ్ కారణంగా టీడీపీలోని తటస్థ ఓటర్లు, నాయకులు ఆయనకు మద్దతు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నారు. అయితే, టికెట్ ఆశించి భంగపడ్డ కొందరు స్థానిక టీడీపీ అసంతృప్త నేతలు లోపాయికారీగా (సైలెంట్గా) ఉంటారా లేక యాక్టివ్గా పని చేస్తారా అనేది చూడాలి. రెబెల్అ భ్యర్థులు బరిలో ఉంటే అది రాధా ఓట్ల శాతాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే, విజయవాడ మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవడం కూటమికి అత్యంత ప్రతిష్ఠాత్మకం కాబట్టి, చిన్న చిన్న విభేదాలను పక్కనబెట్టి టీడీపీ నేతలు రాధాకు బహిరంగంగా పూర్తి మద్దతు ప్రకటిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఓట్లు పూర్తిగా బదిలీ అవుతాయా లేదా అనేది ప్రచార సరళిని బట్టి స్పష్టమవుతుంది.

# సరస్ మేళా.. ఆత్మవిశ్వాసానికి, ఆర్థిక స్వావలంబనకు వేదిక

- **గ్రామీణ మహిళా ఉత్పత్తుల సమాహారానికి చిరునామా**
- **సంప్రదాయ కళలు, చేనేత, హస్తకళలకు చేయూత**
- **మేళాను సద్వినియోగం చేసుకోండి..**
- **కళలు, కళాకారులను ప్రోత్సహించండి**
- **జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ, అక్టోబర్,18,(మనం న్యూస్):** జాతీయస్థాయి సరస్ మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకొని గ్రామీణ మహిళల ఉత్పత్తులను ప్రోత్సహించి, కొనుగోలు చేయడం ద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలని, సంప్రదాయ కళలు, చేనేత, హస్తకళలకు చేయూతనివ్వాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 31వ తేదీ వరకు విజయవాడ పున్నమి ఘాట్లో జరిగే సరస్ మేళా గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళల ప్రతిభకు చిరునామాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న దాదాపు 600 స్టాళ్లలో ఒక్కో స్టాల్ ఒక్కో నైపుణ్యానికి, ప్రతిభకు ప్రతిరూపమని వివరించారు. 50 లైవ్ ఫుడ్కోర్ట్స్ ఆహార ప్రియులకు మధురానుభూతులను పంచుతున్నాయన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ.. ఆంధ్రప్రదేశ్ సెర్ప్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మేళా గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, సృజనాత్మకతకు, పారిశ్రామిక సామర్థ్యాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ప్రజలకు పరిచయం చేయడానికి, విస్తృత మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఈ మేళా చక్కని వేదికగా నిలుస్తోందని తెలిపారు. ప్రజలు, సందర్శకులు పెద్ద సంఖ్యలో మేళాను సందర్శించి గ్రామీణ మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారి జీవనోపాధుల బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. 1999లో ప్రారంభమై అంచెలంచెలుగా ఎదిగి: 1999లో ప్రారంభమైన ఈ కార్యక్రమం క్రమంగా విస్తరించి, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గ్రామీణ ఉత్పత్తిదారులు, చేతివృత్తుల కళాకారులు, హస్తకళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రతిష్ఠాత్మక మేళాగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. సరస్ మేళాలో 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి దాదాపు 1,500 మంది వ ుహిళా పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో ప్రత్యేకతలను ప్రతిబింబించే చేనేత వస్త్రాలు, సంప్రదాయ దుస్తులు, హస్తకళా వసు ్తవులు, గృహాలంకరణ ఉత్పత్తులు, చేతితో తయారుచేసిన వస్తువులు, ఆహార పదార్థాలు, గ్రామీణ ఉత్పత్తులు సందర్శకులను ఆకర్షిస్తున్నాయన్నారు. ఒక్కో ప్రాంతానికి చెందిన కళలు, సంప్రదాయాలు, ఉత్పత్తుల వైవిధ్యాన్ని తెలుసుకునే అవకాశంతో పాటు, వాటిని తయారుచేసే మహిళల శ్రమ, నైపుణ్యం, సృజనాత్మకతను గుర్తించే వేదికగా ఈ మేళా నిలుస్తోందని.. మహిళా స్వయం సహాయక సంఘాలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడానికి, కొత్త మార్కెట్లను చేరుకోవడానికి, వ్యాపార నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఇది దోహదపడుతోందన్నారు.

### గ్రామీణ మహిళల శ్రమను ప్రోత్సహించండి:

విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ ఆజీవిక మేళాలో తెలుగు హస్తకళల ప్రతిరూపాలు, ఒడిశా కళాఖండాలు, అస్సాం వెదురు బుట్టలు, సంప్రదాయ ఆభరణాలు, జనపనారతో తయారు చేసిన బ్యాగులు, ఇత్తడి కళాఖండాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయన్నారు. ప్రజలు, కుటుంబాలు, యువత, కొనుగోలుదారులు సందర్శించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కోరారు. గ్రామీణ మహిళలు ఎంతో శ్రమించి తయారుచేసిన చేనేత వస్త్రాలు, చేతివృత్తుల ఉత్పత్తులు, సంప్రదాయ హస్తకళా వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా వారి నైపుణ్యాలను ప్రోత్సహించడంతో పాటు కుటుంబాల ఆదాయ వృద్ధికి ప్రత్యక్షంగా తోడ్పడవచ్చని పేర్కొన్నారు. స్థానిక, గ్రామీణ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సంప్రదాయ కళలు, చేతివృత్తులను పరిరక్షించడంతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలకు మరిన్ని అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో మేళాను విజయవంతం చేసి, గ్రామీణ మహిళల ఆత్మవిశ్వాసానికి, స్వావలంబనకు బలమైన మద్దతు అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# పేదల వద్ద నుండి పన్నుల రూపంలో పిండి సొంత మనుషులకు దోచిపెడుతున్న కూటమి నేతలు

**▶▶ ఎమ్మెల్సీ పర్వత్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి**



**నెల్లూరు: అక్టోబర్ 18 (మనం న్యూస్):** రాష్ట్రంలో రిజర్వేషన్లు రాకముందే నెల్లూరు జిల్లా వైసీపీ అభ్యర్థి ఆనం విజయకుమార్ రెడ్డి అని ప్రకటించి జగన్మోహన్ రెడ్డి సంచలనానికి తెరలేపాడని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ ఇన్చార్జి,ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆనం విజయకుమార్ రెడ్డి చాలా సౌమ్యుడని ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు చేసే గొప్ప మనిషి అని ఆయనను గెలిపించాలన్నారు. కార్పోరేషన్ లో పన్నుల రూపంలో పేదవాళ్ళ ముక్కు పిండి వసూలు చేస్తున్న డబ్బును కూటమి నేతలకు పంచి పెడుతున్నట్లు ఎమ్మెల్సీ ఆరోపించారు.కమిషనర్ వన్ సైడ్ చేస్తున్నారని తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత కమిషనర్ పై చర్యలు తీసుకుంటామన్నారు. గడిచిన రెండున్నర సంవత్సరంలో కూటమి నేతలు కోట్లాది రూపాయలను అక్రమంగా దోచుకున్నట్లు ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు.తిన్న ప్రతి రూపాయను కక్కిస్తామని ఆ రోజుల త్వరలోనే వస్తాయని ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని సిటీ ఇన్చార్జి ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# విజయోత్సాహంతో కూటమి నామినేషన్లు

**ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సారథ్యంలో ర్యాలీ**

**నందిగామలో రాబోయేది చారిత్రాత్మక బోరు అన్న సౌమ్య**

**ఆదివారం సమర్పించినవి కేవలం నామినేషన్ పత్రాలు కాదు నందిగామ ప్రగతి రథానికి చక్రాలు. ఆ రథాన్ని విజయపథంలో నడిపించబోయే మన కూటమి అభ్యర్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు.'తంగిరాల సౌమ్య, ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే.**

**నందిగామ, అక్టోబర్ 18, మనం న్యూస్:** నందిగామ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమం ఆదివారం పండుగ వాతావరణంలో జరిగింది. ప్రభుత్వ విప్, నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య సారథ్యంలో చైర్మన్ అభ్యర్థి శాఖమూరు వంశీధర్, కూటమి కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాకాని నగర్లోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ర్యాలీ బయలుదేరింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జెండాలు, నినాదాలతో గాంధీ సెంటర్ మీదుగా ర్యాలీ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ర్యాలీ పాత బస్టాండ్ సెంటర్లోని బాబు జగజ్జీవన్ రామ్ భవన్కు చేరుకుంది, అక్కడ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అనంతరం సౌమ్య మీడియాతో మాట్లాడారు. 'నందిగామలో రాబోయేది ఒక చారిత్రాత్మక బోర్డు. ఈ రెండేళ్లలో కూటమి ప్రభుత్వం నందిగామ మున్సిపాలిటీకి రూ. 154 కోట్లకు పైగా నిధులు తెచ్చింది. చైర్మన్ వంశీధర్ నాయకత్వంలో ఈ నిధులతో నందిగామ రూపురేఖలు మార బోతున్నాయి' అని ఆమె అన్నారు. రూ. 103 కోట్లతో ఇంటింటికీ కృష్ణా జలాలు అందించే పథకం పనులు సాగుతున్నాయని ఆమె వివరించారు. రూ. 19 కోట్లతో పెండింగ్లో ఉన్న సీసీ రోడ్లన్నీ, నూతన మున్సిపల్ కార్యాలయ భవనం, పార్క్, సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ రాబోతున్నాయని చెప్పారు. రూ. 17 కోట్లతో పట్టణమంతటా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటవుతుందన్నారు. వీటికి తోడు కేంద్రీయ విద్యాలయం, వంద పడకల ఆసుపత్రి ఆధునీకరణ నందిగామను కొత్త దిశలో నడిపిస్తాయన్నారు. 'ఇవి ఎన్నికల వాగ్దానాలు కావు. నిధులు వచ్చి, పనులు ప్రారంభమై, మీ కళ్ల ముందు రూపుదిద్దుకుంటున్న అభివృద్ధి ఇది' అని స్పష్టం చేశారు. చైర్మన్ అభ్యర్థి శాఖమూరు వంశీధర్ మాట్లాడుతూ, 'సౌమ్య నందిగామ అభివృద్ధి గురించి ఎన్నో కలలు కంటున్నారు. ఆ కలలన్నిటినీ సాకారం చేయడానికి 32 మంది కూటమి వార్డు సభ్యులతో కలిసి నా వంతు గట్టిగా కృషి చేస్తాను. పార్టీ నాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను' అన్నారు. ర్యాలీని విజయవంతం చేసిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. 'మూడు పార్టీలు ఒక్కటిగా నిలబడితే ఎంత బలమో ఆదివారం నందిగామ చూసింది. ఈ అభివృద్ధి కొనసాగాలంటే చైర్మన్ అభ్యర్థి వంశీధర్ ని, కూటమి కౌన్సిలర్ అభ్యర్థులందరినీ అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించండి' అని ఆమె ప్రజలను కోరారు. నినాదాల్లో ఉత్సాహం చేతల్లో అభివృద్ధి మనసుల్లో గెలుపు నమ్మకం. మూడు పార్టీలదీ ఒకే అడుగు, ఒకే లక్ష్యం: నందిగామ ప్రగతి.ఇదే కూటమి బలం, రేపటి విజయం!



# దుర్గా ఘాట్లో హంస వాహనం ట్రయల్ రన్



**విజయవాడ, అక్టోబర్,18,(మనం న్యూస్):** ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో దుర్గా ఘాట్ వద్ద హంస వాహనం (తెప్పోత్సవం) ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్తో పాటు స్థానాచార్యులు శివ ప్రసాద్ శర్మ, వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. హంస వాహనం నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు, భద్రతా చర్యలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను అధికారులు సమీక్షించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై దృష్టిసారించారు.



# ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

**▶▶ మునిసిపల్ కమిషనర్ లోవరాజు**

**▶▶ సోమవారం 19వ తేదీన సంబంధిత ఎన్నికల అధికారుల చే నామినేషన్ల పరిశీలన ప్రక్రియ**

**నందిగామ,అక్టోబర్ 18,మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం వారి ప్రకటన అనుసరించి సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా నందిగామ పురపాలక సంఘం నందలి 32 వార్డు సభ్యుల ఎన్నిక మరియు చైర్ పర్సన్ ఎన్నిక నిమిత్తము గత 3 రోజుల నుండి అనగా తేదీ.16.10.2026 నుండి తేదీ.18.10.20 26 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసినది. ఈ నేపథ్యంలో 32 వార్డులకు గానూ 169 వార్డు కౌన్సిలర్ నామినేషన్లు అదేవిధంగా చైర్ పర్సన్ పదవి కొరకు 19 నామినేషన్లు దాఖలు కాబడినవి. ఇందుపై సోమవారం తేదీ.19.10.2026 న డా. బాబు జగ్జీవన్ రామ్ సమావేశపు హాలు నందు ఉదయం గం.11.00 ల నుండి సంబంధిత ఎన్నికల అధికారుల చే నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టబడునని నందిగామ పురపాలక సంఘ కమిషనర్ జి. లోవరాజు తెలియపరిచారు.



## ఘనంగా బతుకమ్మ వేడుకలు



**నందిగామ, అక్టోబర్ 18, మనం న్యూస్:** అంబారిపేట గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మహిళలు బతుకమ్మ వేడుకలను అత్యంత ఘనంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. గ్రామంలోని ఆడపడుచులు రంగురంగుల పూలతో త్రికోణాకారంలో బతుకమ్మలను అందంగా పేర్చారు. గునుగు పూలు, తంగేడు పూలు, బంతి పూలు, చేమంతి పూలతో బతుకమ్మ మరింత శోభాయమానంగా కనిపించింది. ఆలయ ప్రాంగణంలో వలయంగా చేరిన మహిళలు, చప్పట్లు కొడుతూ, బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు.బతుకమ్మా బతుకమ్మా ఉయ్యాలో... బంగారు బతుకమ్మా ఉయ్యాలో... అంటూ పాడిన జానపద పాటలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. చిన్నారులు, యువతులు, పెద్దలు అందరూ కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని, గౌరీదేవిని పూజించడం వల్ల సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలుగుతాయని మహిళలు తెలిపారు. అనంతరం బతుకమ్మలకు ప్రత్యేక పూజలు చేసి, సమీపంలోని నీటిలో నిమజ్జనం చేశారు. అనంతరం మహిళలు ఒకరికొకరు బతుకమ్మ ప్రసాదాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామ మహిళా సంఘాల సభ్యులు, అంగన్ వాడీ కార్యకర్తలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట చరిత్రలోనే భారీ మెజార్టీతో విజయం సాధిస్తాం




▶▶ **మున్సిపల్ ఎన్నికలపై శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం**

**జగ్గయ్యపేట అక్టోబర్ 18 మనం న్యూస్:** మున్సిపల్ ఎన్నికలలో జగ్గయ్యపేట చరిత్రలోనే ఎన్నడూ లేనంత భారీ మెజార్టీతో కూటమి బలపరిచిన తెలుగుదేశం అభ్యర్థి నరేంద్రుల వినీత విజయం సాధించనున్నారని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, నెట్టెం రఘురామ్ లు అన్నారు. జగ్గయ్యపేట మున్సిపల్ ఎన్నికలలో తెలుగుదేశం చైర్మన్ అభ్యర్థిగా నరేంద్రుల వినీత నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ నెట్టెం రఘురామ్ లు మాట్లాడుతూ మున్సిపల్ చరిత్రలోనే భారీ విజయాన్ని నమోదు చేయనున్నట్లు తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ తెలుగుదేశం జనసేన బిజెపిల కూటమి పాలనలో రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగుతుందన్నారు. ఈసారి జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలలో జగ్గయ్యపేట చరిత్రలోనే భారీ మెజారిటీ తో విజయం సాధించనున్నామని రఘురాం ధీ మా వ్యక్తం చేశారు. కూటమి పాలనలో రాష్ట్రంలో ప్రజా రంజక పాలన సాగుతోందని గతంలో విధ్వంసకర పాలనకు ప్రజలు చమర గీతం పాడారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో పాలన సాగుతోందని రానున్న మునిసిపల్ ఎన్నికలలో చైర్మన్ అభ్యర్థిగా నరేంద్రుల వినీత, 36 మంది కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలోసంక్షేమ పాలన సాగుతోంది అన్నారు. జగ్గయ్యపేట మున్సిపాలిటీలో ప్రతి వీధిలోను సిమెంట్ రోడ్లు డ్రైన్లు మంచినీటి సదుపాయం పై ప్రత్యేక దృష్టి సారించామని రానున్న మున్సిపల్ ఎన్నికలలో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతున్నట్లే మున్సిపాలిటీలను అభివృద్ధి ధ్యేయంగా పాలన ను అందించనున్నట్లు తెలిపారు. పట్టణాన్ని అభివృద్ధికి చిరునామాల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు, రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, నూకల కుమార్ రాజా, ప్రముఖులు నూకల బాలకృష్ణ, తదితర ప్రముఖులు పెద్ద సంఖ్యలో ఉద్దేశం నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## నా తండ్రి మున్సిపల్ చైర్మన్‌గా పదవీ స్వీకారం చేసిన ఈనెల 30న నేను ప్రమాణస్వీకారం చేస్తా

▶▶ **తెలుగుదేశం చైర్మన్ అభ్యర్థి నరేంద్రుల వినీత**

**జగ్గయ్యపేట అక్టోబర్ 18 మనం న్యూస్:** 17 సంవత్సరాల క్రితం తన తండ్రి శ్రీరామ్ సుబ్బారావు మున్సిపల్ చైర్మన్ గా అక్టోబర్ 30వ తేదీన పదవి స్వీకార ప్రమాణం చేశారని యాదృచ్ఛికంగా కలసివచ్చిన ఈనెల 30వ తేదీనే తా ను మున్సిపల్ చైర్మన్ గా పదవీ స్వీకార ప్రమాణం చేస్తానని కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నరేంద్రుల వినీత తెలిపారు. ఆదివారం కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ చైర్మన్ అభ్యర్థిగా నరేంద్రుల వినీత నేతలతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ 2009 అక్టోబర్ 30 వ తేదీన తన తండ్రి శ్రీరామ్ సుబ్బారావు మున్సిపల్ చైర్మన్ గా పదవి స్వీకార ప్రమాణం చేశారని, ఈనెల 28న ఎన్నికల అనంతరం ఈనెల 30వ తేదీన తాను పదవి స్వీకార ప్రమాణం చేయనున్నట్లు గా ప్రకటించారు. యాదృచ్ఛికంగా భగవంతుని సంకల్పంతో అక్టోబర్ 30వ తేదీనే ఎన్నికల కౌంటింగ్ పూర్తి అవుతుందని నేతల సహకారం ప్రజా బలంతో తాను విజయం సాధించటం ఖాయమని పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీనే తాను పదవి స్వీకార ప్రమాణం చేస్తానని తెలిపారు. తనను మున్సిపల్ చైర్మన్ గా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, బిజెపి నేతలకు నరేంద్రుల వినీత కృతజ్ఞతలు తెలిపారు. తనకు రాజకీయాలు కొత్తగాని తన కుటుంబానికి రాజకీయాలు చిరపరిచితమే తాను చిన్నప్పటి నుంచి రాజకీయాలను చూస్తూనే ఉన్నానని,పెద్దలు నెట్టెం రఘురాం, శాసనసభ్యులు తన సోదరులు శ్రీరాం రాజగోపాల్, తదితర పెద్దల సహకారం సూచనలతో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి పట్టణాన్ని అభివృద్ధికి చిరునామాల తీర్చిదిద్దుతానని అన్నారు. చైర్మన్ గా తనతో పాటు కూటమి అభ్యర్థులు 36 మందిని భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టణంలోని ప్రతి వార్డు ను అభివృద్ధి చిరునామాల మారుస్తానని చైర్మన్ అభ్యర్థి నరేంద్రుల వినీత అన్నారు.



## అట్టహాసంగా తెలుగుదేశం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా నరేంద్రుల వినీత నామినేషన్

▶▶ **నామినేషన్ కార్యక్రమాల్లో పాల్గొన్న శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం , మాజీ మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు, రంగాపురంరాఘవేంద్ర**



**జగ్గయ్యపేట అక్టోబర్ 18 మనం న్యూస్:** తెలుగుదేశం పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా నరేంద్రుల వినీత అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, మాజీ మంత్రి కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, మాజీ మున్సిపల్ చైర్మన్ తన తండ్రి శ్రీరామ్ సుబ్బారావు, తదితర ప్రముఖులు వెంటరాగా వినీత నామినేషన్ దాఖలు చేశారు. తొలుత పట్టణంలోని విగ్నేశ్వర స్వామి వారి ఆలయంలో నేతలతో కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించిన వినిత అనంతరం ప్రదర్శనగా మున్సిపల్ కార్యాలయానికి చేరి నామినేషన్ దాఖలు చేశారు. శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సుబ్బారావు, రంగాపురం రాఘవేంద్ర, యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య, కూటమి పార్టీలకు చెందిన నేతలు ప్రముఖులు పాల్గొన్నారు. నరేంద్రుల వినీత నామినేషన్ కార్యక్రమాల్లో శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ సతీమణి శ్రీరామ్ శ్రీదేవి, శ్రీరామ్ సునీత తదితర మహిళ నేతలు ప్రముఖులు పెద్ద సంఖ్యలో నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## నందిగామ మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసే కూటమి అభ్యర్థుల జాబితా



**నందిగామ,అక్టోబర్ 18,మనం న్యూస్:** నందిగామ మున్సిపల్ ఎన్నికలు కూటమి అభ్యర్థులు వీరే చైర్మన్ అభ్యర్థి శాఖమూరు వంశీధర్ మరియు వార్డుల వారీగా కూటమి అభ్యర్థులు. 1వ వార్డు: తొర్లికొండ సీతారామయ్య (బీజేపీ అభ్యర్థి), 2వ వార్డు: దారెల్లి బుజ్జి, 3వ వార్డు: దారెల్లి ఇంద్రజ, 4వ వార్డు: చావా సురేష్, 5వ వార్డు: దేవరకొండ ఎస్తేరు, 6వ వార్డు: చంద్ర రాజకుమారి, 7వ వార్డు: వీసం పద్మ (బీజేపీ అభ్యర్థి), 8వ వార్డు: ఖరీదు పద్మ, 9వ వార్డు: మండవ శ్రీనివాసరావు, 10వ వార్డు: కొండూరు వెంకటరమణ, 11వ వార్డు: కామసాని శ్రీనివాసరావు, 12వ వార్డు: గద్దె శేషు కుమారి.13వ వార్డు: కొప్పాకుల వరలక్ష్మి, 14వ వార్డు: మేడ విజయ, 15వ వార్డు: షేక్ ఇమామ్, 16వ వార్డు: నల్లగర్ల లక్ష్మి, 17వ వార్డు: యేచూరు రామకృష్ణ, 18వ వార్డు: కేతేపల్లి ప్రతిమ, 19వ వార్డు: షేక్ ఖలీక్, 20వ వార్డు: మేకపోతుల శ్రీలక్ష్మి (జనసేన అభ్యర్థి), 21వ వార్డు: అచ్చి దివ్య, 22వ వార్డు: షేక్ ఇమామ్ జానీ, 23వ వార్డు: కాసర్ల నాగమణి, 24వ వార్డు: రంగశెట్టి హుస్సేన్ రావు, 25వ వార్డు: కే. నాగమణి, 26వ వార్డు: కొమరగిరి సత్యనారాయణ, 27వ వార్డు: కొండ్రు జాన్ కుమార్,28వ వార్డు: తోటకూర నాగరాణి, 29వ వార్డు: మందా జాన్ పీటర్, 30వ వార్డు: జనసేన అభ్యర్థి, 31వ వార్డు: జనసేన అభ్యర్థి, 32వ వార్డు: జనసేన అభ్యర్థి

# గెలుపు దిశగా ప్రచారం చేస్తున్న వైసిపి చైర్మన్ అభ్యర్థి చల్లా బ్రహ్మం



- ప్రజల నుంచి అపూర్వ స్పందన
- పట్టణంలోని 14 వ వార్డులో స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వార్డు నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్

**నందిగామ, అక్టోబర్ 18, మనం న్యూస్:** నందిగామ లో మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. మంచి మనిషి చైర్మన్ అభ్యర్థి చల్లా బ్రహ్మం కి మద్దతు ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ కోరారు. పట్టణంలోని హనుమంతు పాలెం లో మరియు 24 వ వార్డు అశోక్ నగర్ లలో ఇంటింటి ప్రచారాన్ని చైర్మన్ అభ్యర్థి చల్లా బ్రహ్మం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రెడ్డి , ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ఇచ్చిన అవకాశంతో నందిగామ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని... నా పై వారు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చైర్మన్ అభ్యర్థి చల్లా బ్రహ్మం తెలిపారు. నందిగామ ను అభివృద్ధి చేయాలి - ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో పని చేస్తున్నామని ప్రజలంతా సహకరించాలని మంచి చేయాలనే నా ఆలోచనకు మద్దతు ఇవ్వాలని చల్లా బ్రహ్మం కోరారు. గత ఐదేళ్ల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో నందిగామ పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని పట్టణ రూపు రేఖలు మారే విధంగా రోడ్ల విస్తీర్ణ - కేంద్ర విద్యాలయం, 100 పడకల ఆసుపత్రి లను మంజూరు చేయించామని కోట్ల రూపాయలతో డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు.మరొకసారి ప్రజలు అవకాశం కల్పిస్తే మరింత మంచి చేస్తామని పట్టణ ప్రజలు ఫ్యాను గుర్తుపై ఓటేసి మద్దతు ఇవ్వాలని చల్లా బ్రహ్మం కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**నందిగామ,అక్టోబర్ 18,మనం న్యూస్:** నందిగామ చైతన్య కళాశాల లో 1997-99 విద్యా సంవత్సరంలో ఇంటర్ వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగినది. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో ఎక్కడెక్కడో స్థిరపడినవారు వచ్చి, అందరూ కలుసుకొని చదువుకున్న నాటి గత స్మృతులు గుర్తుచేసుకొని ఆనందోత్సవాల మధ్య పూర్వ విద్యార్థుల కలయిక జరిగింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చైతన్య కాలేజ్ ప్రిన్సిపల్ అమరనేని రమేష్, అకాడమిక్ డైరెక్టర్ అమరనేని జ్యోతి, లెక్చరర్ రామకృష్ణ ని ఘనంగా సన్మానించడం జరిగింది.

# 27వ వార్డులో కూటమి అభ్యర్థి జోరు

- కొండ్రు జాన్ కుమార్ నామినేషన్ దాఖలు
- యువనేతకు టీడీపీ టికెట్.. డీవీఆర్ కాలనీలో కొత్త ఉత్సాహం.



**నందిగామ, అక్టోబర్ 18, మనం న్యూస్:** నందిగామ మున్సిపల్ ఎన్నికల్లో 27వ వార్డు (ఎస్సీ రిజర్వ్డ్) లో కూటమి అభ్యర్థిగా యువ నాయకుడు కొండ్రు జాన్ కుమార్ ఆదివారం తన నామినేషన్ పత్రాలను విజయవంతంగా దాఖలు చేశారు. యువ నాయకుడికి టీడీపీలో అవకాశం రావడంతో కాలనీలో కొత్త ఉత్సాహం నెలకొంది. ముందుగా 27వ వార్డు కాలనీ ప్రజలు, ప్రముఖ నాయకులు, మహిళలు, టీడీపీ కార్యకర్తలు కలిసి డీవీఆర్ కాలనీ నుంచి భారీ బైక్ ర్యాలీతో బాబూ జగజ్జీవన్ రావు హాల్ వరకు హోరెత్తించారు. యువకుడి నామినేషన్ ర్యాలీతో రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. యువతకు ప్రాధాన్యత పట్ల హర్షం వ్యక్తం చేశారు.కాలనీకి చెందిన యువతకు టీడీపీ అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వడంపై కాలనీ ప్రజల్లో టీడీపీ పార్టీ పట్ల గౌరవాభిమానాలు మరింత పెరిగాయని స్థానికులు పేర్కొంటున్నారు.

## అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా - కొండ్రు జాన్ కుమార్.

నామినేషన్ అనంతరం కొండ్రు జాన్ కుమార్ మాట్లాడుతూ 'నాకు ఈ అవకాశం ఇచ్చిన టీడీపీ అధిష్టానానికి, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకి ముందుగా హృదయపూర్వక కృతజ్ఞతలు. పార్టీ నాపై నమ్మకం ఉంచి కౌన్సిలర్ అభ్యర్థిగా అవకాశం ఇచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కాలనీ అభివృద్ధి కోసం పోరాడతా. డ్రైనేజీ, వీధి దీపాలు, సీసీ రోడ్లు వంటి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తా' అని కాలనీ ప్రజలకు, పార్టీ అధిష్టానానికి హామీ ఇచ్చారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో 27వ వార్డు ఇంచార్జ్ బండారు శేషు, బండారు గంగమ్మ, బండారు గోపి, టీడీపీ కార్యకర్తలు, మహిళలు, యువత భారీగా పాల్గొని నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జగన్మాత నామస్మరణతో మారుమోగిన దేవాలయాలు



- ఓం శ్రీ కనకదుర్గయే నమః
- దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు 8వ రోజు ఆదివారం జగన్మాత

## కనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది

**నందిగామ,అక్టోబర్ 18,మనం న్యూస్:** నందిగామ మండలం అంబతరుపేట గ్రామంలో వేంచేసిన శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయంలో ఆలయ ఈవో పీవీకే సీతారావమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ మంచాల మాధవరావు, ధర్మకర్తల మండల సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాముల నందిగామ సుబ్బారావు శర్మ, బాల కోటేశ్వర శర్మ,రఘునాథ శర్మ అవధానుల ఆధ్వర్యంలో శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారికి కనక దుర్గాదేవిగా ప్రత్యేక అలంకరణలు, విశేష కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులు వేదోక్తంగా నిర్వహించారు.. అంబర్పేట గ్రామంలో దేవి శరన్న నవరాత్రి ఉత్సవాల్లో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ శిరీష దంపతులు, మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరావు కుటుంబ సభ్యులు, తోపాటు గుంటూరు జిల్లా సివిల్ సప్లై అధికారిని కోమలి పద్మ, పలు గ్రామాల నాయకులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు, ఆలయ కమిటీ చైర్మన్ మంచాల మాధవరావు ధర్మకర్తల మండలి సభ్యులు.. అమ్మవారి శేష వస్త్రం ప్రసాదాలు అందజేసి వసంత కృష్ణ ప్రసాద్ శిరీష దంపతులకు, మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరావు, వేద ఆశీర్వచన చేశారు.. సత్తమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణం జగన్మాత నామస్మరణతో మారుమోగింది.. కూడలి సంగమేశ్వర స్వామి ఆలయం, రాజరాజేశ్వరీ దేవి ఆలయం, గొల్లమూడి శంభు లింగేశ్వర స్వామి ఆలయం, వీరభద్ర స్వామి ఆలయాం, పల్లగిరి గట్టుపై కనకదుర్గ కనకమహాలక్ష్మి జ్ఞాన సరస్వతి అమ్మవార్ల త్రిశక్తి పీఠం పలు ఆలయాల్లో అమ్మవారు కనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చింది, ఆయా దేవాలయాల్లో అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు..

# కనకదుర్గాదేవి అవతారంలో మరిడి మహాలక్ష్మి అమ్మవారు



**నందిగామ, అక్టోబర్ 18, మనం న్యూస్:** నందిగామ పట్టణంలోని శ్రీ మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా నేడు అమ్మవారు కనకదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ రూపంలో వాసవి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎరుపు రంగు పట్టు చీర, బంగారు ఆభరణాలు, కిరీటం, నుదుటన పెద్ద కుంకుమ బొట్టు, నాలుగు చేతులలో శంఖు, చక్ర, త్రిశూలం, అభయ హస్తంతో దుర్గతి నాశినిగా అమ్మవారు దర్శనమిస్తున్నారు. ఆలయాన్ని రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. ఉదయం నుండే అర్చక స్వాములు అమ్మవారికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, దుర్గా సప్తశతి పారాయణం, చండీ హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. కనకదుర్గాదేవిని దర్శించుకుంటే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని, శత్రు బాధలు తొలగిపోతాయని, విజయం చేకూరుతుందని భక్తుల నమ్మకం. అమ్మవారు కనకదుర్గాదేవి అలంకారంలో ఉన్నారని తెలుసుకుని భక్తులు, పట్టణ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

# బిజెపీ పార్టీ ఆధ్వర్యంలో నామినేషన్ల ప్రక్రియ

- 1వ వార్డు అభ్యర్థిగా తొర్లికొండ సీతారామయ్య నామినేషన్.
- 7 వార్డు అభ్యర్థి గా వీసం పద్మ గారు నామినేషన్



**నందిగామ, అక్టోబర్ 18,** నందిగామ మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 1వ వార్డు నుండి అభ్యర్థిగా తొర్లికొండ సీతారామయ్య,7 వార్డు అభ్యర్థి గా వీసం పద్మ, ఆదివారం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.మున్సిపల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు అనంతరం తొర్లికొండ సీతారామయ్య, వీశం పద్మ మాట్లాడుతూ... వార్డులలోని ప్రజలంతా తనకు అండగా ఉన్నారని, తనను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వార్డులోని సమస్యల



పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వార్డులను ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, 1వ మరియు 7వ వార్డు ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జై భవాని జై జై భవాని అమ్మవారి నామస్మరణతో మారుమోగిన దేవాలయాలు



నందిగామ,అక్టోబర్ 18,మనం న్యూస్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నందిగామ పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. 8వ రోజు ఆదివారం పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక శ్యామలాంబ దేవి అమ్మవారుకి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి శ్రీ చక్ర మందిరం, శ్రీ మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, రామలింగేశ్వర నగర్ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో మాలికాపురత్తమ్మ అమ్మవారు కనకదుర్గాదేవిగా ప్రత్యేక అలంకరణలు, సామూహిక కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులు విశేష పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

## అగస్త్య పీఠంలో దేవీ నవరాత్రుల్లో భాగంగా నవకన్య పూజ కార్యక్రమాలు



వీరులపాడు అక్టోబర్ 18, మనం న్యూస్: ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం నరసింహారావు పాలెం లోని అగస్త్య పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అత్యంత కీలకమైన మరియు విశేషమైన రోజు దుర్గాష్టమి. దేవీ నవరాత్రుల్లో ఎనిమిదో రోజు అయిన అష్టమి రోజున అమ్మవారిని పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ రోజున అగస్త్య పీఠంలో సుగుణానంద స్వామి ఆధ్వర్యంలో నవ కన్యా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సుగుణ నంద స్వామి మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుంచి సంవత్సరాం నుండి పదేళ్ల లోపు వయసున్న చిన్నపిల్లలను (కన్యలను) ఆహ్వానించి, వారి పాదాలను కడిగి, నూతన వస్త్రాలు మరియు దక్షిణ ఇచ్చి దుర్గా స్వరూపాలుగా ఆరాధిస్తారు అని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి భక్తులందరూ పూజా కార్యక్రమం పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు అనంతరం అన్నప్రసాద కార్యక్రమం లో పాల్గొన్నారు.

## జగ్గయ్యపేటలో బిజెపి కౌన్సిల్ అభ్యర్థులుగా నాలుగు నామినేషన్లు దాఖలు



జగ్గయ్యపేట అక్టోబర్ 18 మనం న్యూస్ : భారతీయ జనతా పార్టీ తరపున మున్సిపల్ కౌన్సిల్ కు నాలుగు నామినేషన్లు దాఖలు అయ్యాయి. బిజెపి నేతలు సీనియర్ నేత కీసర రాంబాబు అన్నపాక ప్రఫుల్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో బిజెపి నేతలు తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఆరవ వార్డుకు పొగడ రాజు నాగమణి, 12 వ వార్డుకు జొన్నలగడ్డ షణ్ముఖ, 25 వార్డుకు అన్నవరపు వెంకటేష్, 35 వ వార్డుకు అన్నే పాక ప్రఫుల్ల శ్రీకాంత్ లు తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నేత కీసర రాంబాబు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ జిల్లా అధిష్ఠానం ఆదేశాల మేరకు కౌన్సిల్లో నాలుగు స్థానాలకు నామినేషన్లను దాఖలు చేసినట్లు తెలిపారు. కూటమి లో భాగంగా జగ్గయ్యపేటలో తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ ,జనసేనల ఉమ్మడి సమావేశం ,నిర్ణయాలు ఏమీ జరగలేదని, ఆశావ హులతో నామినేషన్లు వేయించాలని జిల్లా అధిష్ఠానం ఆదేశాల మేరకు తమ నామినేషన్లను వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు అన్నేపాక ప్రఫుల్ల శ్రీకాంత్ తదితర ప్రముఖులు బిజెపి నేతలు పాల్గొన్నారు.



మనం న్యూస్ కోడూరు 18 :కూటమి ధర్మాన్ని పాటిస్తూ స్థానిక సంస్థల్లో విజయకేతనం ఎగరవేయాలి మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి ధర్మాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ, పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయకేతనం ఎగరవేయాలని మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు పిలుపునిచ్చారు ఆదివారం మండల టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు గ్రామ స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తులను గుర్తించి, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ ప్రతి స్థానానికి ఇద్దరి పేర్లను సేకరించి నియోజకవర్గ ఇన్చార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావుకు అందజేయడం జరుగుతుందన్నారు అనంతరం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా పార్టీ కార్యకర్తలు, ప్రజల అభిప్రాయాలను సేకరించి పోటీ చేయు అభ్యర్థుల పేర్లను ఖరారు చేయడం జరుగుతుందన్నారు. వర్గ విభేదాలను పక్కనపెట్టి స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు ఈ సమావేశంలో గ్రామ కమిటీ అధ్యక్షులు, పీఏసీఎస్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కనకదుర్గాదేవి అవతారంలో దర్శనమిస్తున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు



నందిగామ, అక్టోబర్ 18, మనం న్యూస్: నందిగామ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా నేడు అమ్మవారు కనకదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ రూపంలో వాసవి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎరుపు రంగు పట్టు చీర, బంగారు ఆభరణాలు, కిరీటం, నుదుటన పెద్ద కుంకుమ బొట్టు, నాలుగు చేతులలో శంఖు, చక్ర, త్రిశూలం, అభయ హస్తంతో దుర్గతి నాశినిగా అమ్మవారు దర్శనమిస్తున్నారు. ఆలయాన్ని రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు.ఉదయం నుండే అర్చక స్వాములు అమ్మవారికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, దుర్గా సప్తశతి పారాయణం, చండీ హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.కనకదుర్గాదేవిని దర్శించుకుంటే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని, శత్రు బాధలు తొలగిపోతాయని, విజయం చేకూరుతుందని భక్తుల నమ్మకం.అమ్మవారు కనకదుర్గాదేవి అలంకారంలో ఉన్నారని తెలుసుకుని వాసవి ఆర్యవైశ్య సంఘం భక్తులు, పట్టణ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చవట నాగేశ్వరావు, మారమ్ సత్యనారాయణ,వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం పెద్దలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మగా దర్శనమిచ్చిన అంబారుపేట శ్రీ సత్తెమ్మ తల్లి

- మైలవరం ఎమ్మెల్యే వసంత
- కృష్ణ ప్రసాద్ దంపతుల

ప్రత్యేక పూజలు



నందిగామ, అక్టోబర్ 18,మనం న్యూస్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అంబారుపేట గ్రామంలో కొలువైన శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారు నేడు కనకదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ రూపంలో సత్తెమ్మ తల్లిని అలంకరించారు. ఎరుపు రంగు పట్టు చీర, బంగారు ఆభరణాలు, నుదుటన పెద్ద బొట్టు, చేతిలో త్రిశూలంతో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసే శక్తి స్వరూపిణిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయం నుండి అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణం, చండీ హోమం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, ఆయన సతీమణి శిరీష దంపతులు కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వారి వెంట మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు కూడా ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వంశపారం పర్యంగా వసంత కుటుంబానికి సత్తెమ్మ తల్లి ఇలవేల్పు కావడంతో ప్రతి ఏటా నవరాత్రుల్లో వారు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు, మాజీ మంత్రి కుటుంబానికి అమ్మవారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. అమ్మవారు కనకదుర్గాదేవి అలంకారంలో ఉన్నారన్న విషయం తెలుసుకుని చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వంచాల మాధవ్ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా షేక్ హాఫీ జున్నేసా

- ఇదిబలహీనుడికి, బలవంతుడికి జరిగే యుద్ధం
- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం
- చైర్మన్ అభ్యర్థి హాఫీజున్నిసా





జగ్గయ్యపేట అక్టోబర్ 18 మనం న్యూస్: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా షేక్ హాఫీ జున్నిసా ఆదివారం తన నామినేషన్ను దాఖలు చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, తదితర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రముఖులు వెంటరాగా హాఫీజున్నిసా మున్సిపల్ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

**బలవంతుడికి బలహీనుడికి జరిగే పోరులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దే విజయం**

జగ్గయ్య పేట పట్టణంలో జరిగే మున్సిపల్ ఎన్నికలు బలవంతుడికి బలహీనుడికి జరిగే ఎన్నికలని ఈ అంశాన్ని పట్టణ ప్రజలు గమనించాలని ప్రజా సహకారం ప్రజా ఆమోదంతో విజయం సాధిస్తామని అన్నారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా తనను ఎంపిక చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ కు, నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావుకు హాఫీ జున్నేసా కృతజ్ఞతలు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పేట వాసులు గమనించాలన్నారు. ఒంటరిగా పోటీ చేయలేక మూడు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికలకు సిద్ధమవు తుంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒకటే పో రాటానికి సిద్ధమవుతుందని అన్నారు . జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ ఫలాలు ప్రజలు మరిచిపోవద్దని అన్నారు. బీసీలు మైనార్టీలు ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాలకు నిజమైన సముచిత స్థానం ఇచ్చిన పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గా గత ఐదు సంవత్సరాలుగా తాను పట్టణంలో అనేక సమస్యలపై మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశానని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిగా తనను గెలిపిస్తే పట్టణంలో ప్రజా శ్రేష్ఠ పాలన అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రముఖులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలలో ఆరు కౌన్సిల్ స్థానాలకు నామినేషన్లు వేసిన సిపిఐ నేతలు



**జగ్గయ్యపేట అక్టోబర్ 18 మనం న్యూస్ :** జగ్గయ్యపేట మున్సిపాలిటీకి జరుగుతున్న ఎన్నికలలో పట్టణంలోని ఆరు వార్డులకు తమ అభ్యర్థులను సిపిఐ పార్టీ పోటీకి నిలిపింది. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన నామినేషన్ల కార్యక్రమంలో, 6వ వార్డ్ నుంచి జోనబోయిన శ్రీనివాసరావు, 8వ వార్డ్ నుంచి నీలకంఠం శివప్రసాద్, 10 వార్డు నుంచి అంబోజి శివాజీ, 15 వాటి నుంచి షేక్ షఫీ ఉన్నిసా, 19 వ వార్డు నుంచి మెటికల శ్రీనివాసరావు, 21 వ వార్డు నుంచి గంజి కొండలు, తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి జోనబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ అభ్యర్థులను అఖండ విజయంతో గెలిపించాలని కోరారు. ప్రజా సమస్యల కోసం కమ్యూనిస్టులు నిరంతరం పోరాడుతున్నారని 100 సంవత్సరాలలో పోరాడుతూ ఎన్నో విజయాలను సాధించారని అన్నారు. అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకే కొవ కు చెందినవని ఇప్పటికైనా పట్టణమున్సిపాలిటీలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు సిపిఐ పార్టీ పోటీ చేస్తున్న అభ్యర్థుల కంకి కొడవలి గుర్తుపై తమ అమూల్యమైన ఓటును వేసి బలపరచాలని కోరారు. ప్రజా సమస్యల గళాన్ని కౌన్సిల్లో వినిపించే అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు నంబూరి చలపతిరావు షేక్ చిన్న నాగుల మీరా,భోగ్యం నాగులు మీరా, మెడికల్ శ్రీనివాసరావు తదితర నేతలు ప్రముఖులు సానుభూతిపరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా ప్రముఖ దంత వైద్యురాలు బొజ్జ సౌమ్య నామినేషన్



**జగ్గయ్యపేట అక్టోబర్ 18 మనం న్యూస్ :** ప్రముఖ దంత వైద్యురాలు బొజ్జ సౌమ్య మున్సిపల్ చైర్మన్ స్థానానికి ఇండిపెండెంట్ గా నామినేషన్ దాఖలు చేశారు. ఆదివారం నామినేషన్ల సందర్భంగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా తన నామినేషన్ను దాఖలు చేసిన అనంతరం డాక్టర్ బొజ్జ సౌమ్య మాట్లాడుతూ తాను పోటీ చేయాలనుకున్న అంశాన్ని తెలుగుదేశం పార్టీ పెద్దలు నే ట్టెం రఘురాం, శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, శ్రీరామ్ చిన్నబాబుల దృష్టికి సైతం తీసుకువెళ్లానని అన్నారు. ప్రజలకు కోసం అనుక్షణం సేవ చేసే మీలాంటివారు పోటీ చేస్తానంటే తప్పనిసరిగా అవకాశం కల్పిస్తామన్నారని తెలిపారు. కానీ తనకు అవకాశం కల్పించలేదని అందుకే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్నట్లుగా తెలిపారు. తాము తొలి నుంచి తెలుగుదేశం పార్టీ స్థానిభూతిపరులమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ బొజ్జ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నందిగామ 23వ వార్డులో కూటమి అభ్యర్థిగా కాసర్ల నాగమణి నామినేషన్ దాఖలు

**బీసీ మహిళకు టీడీపీ టికెట్.. ఎమ్మెల్యే సౌమ్య ఆధ్వర్యంలో ఘనంగా నామినేషన్..**

నందిగామ, అక్టోబర్ 18, మనం న్యూస్: నందిగామ మున్సిపల్ ఎన్నికల్లో 23వ వార్డు (బీసీ మహిళ) లో కూటమి అభ్యర్థిగా కాసర్ల నాగమణి (భర్త కాసర్ల లక్ష్మీనారాయణ) ఆదివారం తన నామినేషన్ పత్రాలను విజయవంతంగా దాఖలు చేశారు.

### ఎమ్మెల్యే సౌమ్య ఆధ్వర్యంలో భారీగా ర్యాలీ..

ఆదివారం స్థానిక టీడీపీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో బీసీ సంఘాలు, కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బీసీ మహిళకు అవకాశం రావడంపై ఆ వర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

### ‘అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా‘ – కాసర్ల నాగమణి

ఈ సందర్భంగా కాసర్ల నాగమణి మాట్లాడుతూ ‘నాకు ఈ అవకాశం ఇచ్చిన కూటమి అధిష్టానానికి, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకి ముందుగా హృదయపూర్వక కృతజ్ఞతలు. నాపై నమ్మకం ఉంచి ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా. ప్రజల్లో మమేకమై గెలుపు కోసం నిరంతరం కృషి చేస్తా‘ అని పార్టీ అధిష్టానానికి హామీ ఇచ్చారు. ‘23వ వార్డు ప్రజలు నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని నిలబెట్టుకుంటా. వార్డులోని డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలు, పంపుల మరమ్మతులు వంటి ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించి వార్డును అభివృద్ధి చేస్తా‘ అని 23వ వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు. స్థానికంగా బీసీ సామాజిక వర్గంలో మంచి పట్టు, ప్రజాదరణ ఉన్న కాసర్ల నాగమణికి టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థిగా అవకాశం రావడం పట్ల 23వ వార్డు ప్రజలు తీవ్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనుభవం, అందరితో కలిసిపోయే తత్వం ఉన్న నాయకురాలికి టికెట్ రావడంతో వార్డులో కూటమి గెలుపు ఖాయమని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



## 23వ వార్డు జనసేన అభ్యర్థిగా గొల్లపూడి గురవమ్మ నామినేషన్ దాఖలు



**జగ్గయ్యపేట అక్టోబర్ 18 మనం న్యూస్:** జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఎన్నికలలో పట్టణంలోని 23వ వార్డు నుంచి కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థిగా గొల్లపూడి గురవమ్మ తమ నామినేషన్ ను దాఖలు చేశారు. వార్డులోనితెలుగుదేశం జనసేన పార్టీల నేతలు వెంట రాగా గొల్లపూడి గురవమ్మ తన నామినేషన్ . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నేతలు కాట గాని స్వామి గౌడ్, భారత జగన్, కూటమి నేతలు బత్తుల శ్రీనివాస్ తుమ్మడపు శ్రీనివాస్ ,ఎడవల్లి సతీష్ ,దాసరాజు సైదులు ,అనంత ఏడుకొండలు ,గొల్లపూడి గోపాలకృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

## 22వ వార్డు టీడీపీ అభ్యర్థిగా మారేపల్లి భాష నామినేషన్ దాఖలు



**జగ్గయ్యపేట అక్టోబర్ 18 మనం న్యూస్:** జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ 22వ వార్డుకు తెలుగుదేశం అభ్యర్థిగా మారేపల్లి భాష తన నామినేషన్ ను నేతలు కార్యకర్తలు, అభిమానులతో కలిసి దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి నే తలు, కార్యకర్తలతో కలిసి వచ్చిన భాష నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ, యార్డ్ మాజీ డైరెక్టర్ మల్లెల కొండయ్య, మాజీ కౌన్సిల్ సభ్యులు మారేపల్లి సౌరి, కాసర్ల సైదులు ,బచ్చలకూర దానియేలు ,ఏపూరి చిన్నా ,మల్లెల సురేష్ ,మారేపల్లి ఏసు ,మల్లెల సాయి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## నందిగామ 19వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా గుంజి శ్రీనివాసరావు నామినేషన్

**▶▶ గతంలో 14వ వార్డు నుంచి విజయం, టీడీపీపై అభిమానం**



**నందిగామ,అక్టోబర్ 18,మనం న్యూస్:** నందిగామ పట్టణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా గుంజి శ్రీనివాసరావు ఆదివారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.గతంలో 14వ వార్డు నుంచి పోటీ చేసి విజయం సాధించిన అనుభవం గుంజి శ్రీనివాసరావుకు ఉంది. గతంలో తెలుగుదేశం పార్టీ తరఫున వార్డు సభ్యుడిగా పనిచేసిన ఆయనకు టీడీపీ పట్ల ఎంతో అభిమానం ఉందని సన్నిహితులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 19వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవడంతో ఆయన నామినేషన్ పట్టణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో వార్డు సభ్యుడిగా పనిచేసిన అనుభవంతో ఈసారి 19వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు.

## జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కోరిన తెలుగుదేశం అభ్యర్థిని నరేంద్రుల వినీత



**జగ్గయ్యపేట అక్టోబర్ 18 మనం న్యూస్:** ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను ను తెలుగుదేశం పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నరేంద్రుల వినీత, తన తండ్రి మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సుబ్బారావుతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కోరారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని సామినేని ఉదయభాను నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు, చైర్మన్ అభ్యర్థి నరేంద్రుల వినీత సామినేని ఉదయభాను ను మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి పొత్తుల లో భాగంగా చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు జనసేనపార్టీ నుంచి సంపూర్ణ మద్దతును అందించాలని నరేంద్రుల వినీత కోరారు. ఉదయభాను కు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఉదయభాను మాట్లాడుతూ కూటమి పొత్తుల భాగంగా తెలుగుదేశం ,జనసేన ,బిజెపి అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, జనసేన పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రముఖులు పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# జగ్గయ్యపేట మున్సిపాలిటీలో కౌన్సిల్స్ స్థానాలకు 256 నామినేషన్ల దాఖలు

**జగ్గయ్యపేట అక్టోబర్ 18 మనం న్యూస్:** జగ్గపెట్ట మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కౌన్సిల్ స్థానాలకు మొత్తం 256 నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు ప్రకటించారు. పట్టణంలోని 36 వార్డులకు గాను ఆదివారం 219 నామినేషన్లు దాఖలు అయినట్టు తెలిపారు. వాటిలో భారతీయ జనతా పార్టీ 5, సిపిఐ 6, తెలుగుదేశం పార్టీ నుంచి 125, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 68, జనసేన పార్టీ నుంచి 27, ఇండిపెండెంట్ లు 27 మంది నామినేషన్లను దాఖలు చేసినట్టు తెలిపారు. మొత్తం కౌన్సిల్ స్థానాలకు సంబంధించి 256 నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు.

# జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ స్థానానికి 19 నామినేషన్లు

**జగ్గయ్యపేట అక్టోబర్ 18 మనం న్యూస్:** జగ్గయ్య పేట మున్సిపల్ ఎన్నికలలో చైర్మన్ స్థానానికి మొత్తం 19 నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ నుంచి నరేందుల వినీత, శ్రీరామ్ సూర్యకాంతం,,తెలుగుదేశం పార్టీ (రెబల్) ఆచంట సునీత, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి షేక్ హ ఫీ జున్నేస, షేక్ హఫీ జు ల్లా, పసుపులేటి చంద్రకళ,ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థినిగా దగ్గుపాటి దివ్య, జనసేన పార్టీ తరపున పెద్దాపురం సౌభాగ్యం, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి అలాసపురి మాధవి మూడు సెట్లు, భారత చైతన్య యువజన పార్టీ నుంచి తుమాటి శివలీల, స్వతంత్ర అభ్యర్థులుగా బొజ్జ సౌమ్య, చెక్క వెంకట నాగ వరలక్ష్మి, వనం హరిణి, అతిరాజు వెంకటలక్ష్మి, మునిని ఉమా లు నామినేషన్లను దాఖలు చేసినట్లు అధికారులు ప్రకటించారు.

# విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 42వ డివిజన్ కార్పొరేట్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు బి ఫారం ఇచ్చి ఆదుకోవాలి

**విజయవాడ పశ్చిమ నియోజకవర్గం లోతెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇట్టా భవాని విజ్ఞప్తి**



**గాంధీనగర్ అక్టోబర్ 18 మనం న్యూస్:** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం లోతెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇట్టా భవాని మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా పూర్వీకుల నుండి తెలుగుదేశం పార్టీ జెండా తప్ప వేరే జెండా పట్టుకోవడం వేరే పార్టీకి పనిచేయడం మాకు తెలియదు అన్నారు. పోయిన మున్సిపల్ కార్పొరేషన్ ఎలక్షన్స్ లో తెలుగుదేశం పార్టీ అధికారంలో లేకపోయినా పార్టీకి పోటీ చేసి పార్టీ కోసం నిలబడ్డాను తక్కువ ఓట్లతో ఓడిపోయా 2578 ఓట్లతో సెకండ్ ప్లేస్ లో గట్టి పోటీ ఇచ్చాను అన్నారు కానీ ఈరోజు అధికారంలోకి వచ్చాక పార్టీ సీటు ఎందుకు ఇవ్వడం లేదు పార్టీ పెద్దలను ప్రశ్నిస్తున్నాను పార్టీ ఆఫీస్ కి వెళ్ళిన అప్లికేషన్లు తీసుకొని ఎలాంటి న్యాయం చేయలేదు, జనసేన పార్టీలో కొత్తగా వచ్చిన వాళ్లకి ఏ విధంగా బి ఫారం ఇచ్చి సీటు ఇస్తారని అడుగుతున్నానురు. స్థానికంగా తెలుగుదేశం పార్టీ నమ్ముకొని ఓడిపోయిన పార్టీ కోసమే ఉన్నాం కాబట్టి తెలుగుదేశం పార్టీలో బీఫారం ఇవ్వాల్సిందే అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 42 వ డివిజన్ కార్పొరేటర్ పదవిని ఎస్టీ మహిళకు రిజర్వేషన్ కల్పించారు. కాబట్టి తెలుగుదేశం పార్టీకి కట్టుబడి తరతరాలుగా పనిచేస్తున్న నాకు బి ఫారం ఇచ్చి ఆదరించవలసిందిగా పార్టీ పెద్ద లు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బుద్ధ వెంకన్న ,విజయవాడ ఎంపీ కేసినేని (చిన్ని) శివనాద్ , ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ,నారా లోకేష్ లను ,అభ్యర్థిస్తున్నానని పశ్చిమ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇట్టా భవాని మీడియా ద్వారా కోరారు.

# తప్పు చేశాం

**సీఈసీ మద్దతిచ్చేది లేకుండే**
**ఎస్ఈసీ కూడా చోద్యం చూసింది**
**బాబుకు ధైర్యం లేదు**
**రాష్ట్రంలో ఎన్నికల పేరిట ప్రజాస్వామ్యం ఖూనీ**
**కూటమి ప్రభుత్వంపై గవర్నర్కు వైయస్ జగన్ ఫిర్యాదు**



**విజయవాడ,అక్టోబర్,18,(మనం ప్రతినిధి):** ష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తిగా అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా సాగుతోందని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆక్షేపించారు. స్థానిక ఎన్నికల నామినేషన్ల పర్వంలో చోటు చేసుకుంటున్న అంతులేని అక్రమాలపై లోక్భవన్లో గవర్నర్ అబ్దుల్ నజీర్ను కలిసిన వైయస్ జగన్ ఫిర్యాదు చేశారు. అన్నింటిపై పూర్తి సాక్ష్యాధారాలను ఆయన గవర్నర్కు సమర్పించారు.

రాష్ట్రంలోని 8 మున్సిపాలిటీల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులను బెదిరించి నామినేషన్లు కూడా వేయనీయకుండా అడ్డుకున్నారని, పలుచోట్ల రిటర్నింగ్ అధికారుల ఎదుటే నామినేషన్ పత్రాలను చింపేసిన ఘటనలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను అడ్డుకుంటూ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) మౌనం వహించడం, పోలీసు యంత్రాంగం అధికార పార్టీకి తొత్తుగా మారి తప్పుడు కేసులు బనాయిస్తుండటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీ మిథున్ రెడ్డిపై జరిగిన దాడి, ఎంపీలు వైఎస్ అవినాష్ రెడ్డి, మద్దిల గురుమూర్తిలపై పెట్టిన అక్రమ కేసులను కూడా ఆయన ప్రస్తావించారు.వీటన్నింటి నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో పారదర్శకత తీసుకు రావడానికి నామినేషన్ల ప్రక్రియను ఆన్లైన్ విధానంలో లేదా సెంట్రలైజ్డ్ విధానంలో స్వీకరించాలని, ఎన్నికల విధుల్లో కేంద్ర పారామిలిటరీ బలగాలను మోహరించాలని, పోలింగ్ బూతులు, స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సీసీ కెమెరాల నిఘాతో ప్రత్యక్ష ప్రసారం (లైవ్ వెబ్కాస్టింగ్) నిర్వహించాలని గవర్నర్కు విజ్ఞప్తి చేశారు.

## సీఈసీ నియామక విధానంలో సంస్కరణలు తీసుకరావాలి

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) నియామక విధానంలో సంస్కరణలు తీసుకురావాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ఎన్నికల కమిషనర్ను అధికారంలో ఉన్న పార్టీలు ఎంపిక చేసే విధానం మారాలన్నారు. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కలిసి సీఈసీని ఎంపిక చేసే విధానం ఉండాలని సూచించారు. వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయత పెరగాలంటే నియామకాలు నిర్దేశిత విధానం ప్రకారం జరగాలని జగన్ పేర్కొన్నారు. గతంలో సీఈసీ ప్రతిపాదనకు తాము ఒప్పుకోవడం తప్పే అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. గతంలో సీఈసీ నియామకానికి సంబంధించిన విధానానికి తాము మద్దతు ఇచ్చామని, అయితే ఇప్పుడు ఆ మద్దతును ఉపసంహరించుకున్నామని తెలిపారు. తప్పు జరిగిన తర్వాతే తాము కూడా ఈ అంశాన్ని గుర్తించామన్నారు. అందుకే నియామక ప్రక్రియలో మార్పులు తీసుకురావాలని కోరుతున్నట్లు చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ నియామకంతో పాటు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామక విధానంలోనూ సంస్కరణలు అవసరమని జగన్ అభిప్రాయపడ్డారు.

## ఎస్ఈసీ కూడా చోద్యం చూసింది..

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేటా ఒకప్పుడు చంద్రబాబు పాలనలో సీఎస్ గా పనిచేశారని, కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఆయనను తప్పించిందని జగన్ గుర్తు చేశారు. తమ హయాంలో ఎన్నికలు జరిగితే నిమ్మగడ్డ రమేష్ కుమార్ ను అడ్డంపెట్టి అనేక అవరోధాలు సృష్టించారని జగన్ అన్నారు. పుంగనూరు, తిరుపతి, పులివెందులలో ఎందుకు నామినేషన్లను అడ్డుకున్నారని ప్రశ్నించారు. వైసీపీ అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కున్న ఘటనలు జరిగాయని, అయినా పోలీసులు, ఎస్ఈసీ చర్యలు తీసుకోవడం లేదన్నారు.

## చంద్రబాబుకు ధైర్యం లేకనే...

నిజంగా తన పాలనపై తనకు నమ్మకముంటే నిజాయితీగా ఎన్నికలు జరపాలని అన్నారు. అప్పుడు ప్రజా తీర్పు ఏంటోతెలుస్తుందని జగన్ అన్నారు. నామినేషన్ పత్రాలను చించేస్తుంటే ఇక ఎన్నికలు ఎలా జరుగుతాయో అందరికీ అర్థమవుతుందన్నారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు అనిల్ చంద్ర పునేటా నేతృత్వంలో ఎన్నికలు సజావుగా జరుగుతాయన్న నమ్మకం లేదని వైఎస్ జగన్ అన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి జనం ఎవరేంటో తెలుసుకున్నారని కూడా జగన్ అన్నారు. చంద్రబాబు రక్త చరిత్ర మరోసారి బయటపడిందని వైఎస్ జగన్ అన్నారు.